నన్ను ఉరి తీయండి!

కె. శివరామ్

అర్థరాత్రి!

తరుణేశ్వర్ భార్య సుగంధి, తరుణేశ్వర్ తాత ముత్తాతల కాలంనాటి వాళ్ళనుండి తరుణేశ్వర్ వరకు గల వ్యక్తుల్ని దుయ్యబట్టుతూంది కేకలతో, అరుపులతో, పడక గది నుండి.

వాళ్ళ వంశాన్ని నానా తిట్లతో ఆడిపోసుకోవడం స్పష్టంగా వినబడుతున్నది తరుణేశ్వర్ కు.

మెల్లగా పడక గదిలోకి అడుగుపెట్టాడు, క్రోధంతో.

భర్తను చూడగానే సుగంధి మరింత గట్టిగా శాపనార్థాలతో దుమ్మెత్తి పోస్తూంది, ఎడ తెరిపి లేకుండా!

భార్యను ఎగాదిగా చూశాడు నిప్పుకణాలు రాల్చే కళ్ళతో. అతనిలోని ఆవేశం కట్టలు తెంచుకున్నది.

ఆకలి గొన్న బెబ్బులిలా మారిపోయాడు.

నిబ్బరించుకోలేకపోయాడు, తన ఆవేశంలో.

ఒక్క ఉఖుకు ఉఖికాడు! మంచం మీద కూర్చుని నోటికొచ్చి నట్లల్లా వాగే సుగంధి మీద పడ్డాడు.

సుగంధిని మంచం మీదకు నెట్టి, అదిమిపట్టుకుని గొంతు మీద చేతులుంచి గట్టిగా పట్టుకు నేశాడు.

సుగంధి కిక్కురు మనలేక పోయింది. ఊపిరాడడం లేదు. భర్త చేతులు గొంతు నులిపే శల్లా, ఆగిపోయాయి ఛివాలున!

"ఇప్పుడు చంపితే ఒక్కసారిగా ఛస్తావు! నువ్వు అలా చావ కూడదు" అని తరుణేశ్వర్ బుసలు కొట్టుతూ, తన ఎడమ చేతిని ఆమె గొంతును అదిమి పెట్టి వుంచి, కుడిచేతితో అందిన గుడ్డనందుకుని, సుగంధి నోట్లో కుక్కేశాడు భీకరంగా.

కాళ్ళూ, చేతుల్ని ఇరికించి పట్టుకుని తుండు గుడ్డలతో బిగించి బంధించాడు, బలంగా—ఆవేశంతో!

సుగంధి,భర్త చర్యలకు గిజగిజలాడిపోయింది, భయంతో. గుండెలు గడగడలాడిపోతున్నాయి. అప్పటికే శరీరమంతా చెమటలతో తడిసిపోయింది.

నోట్లో గుడ్డలు కుక్కడం మూలంగా దవడలు నెప్పి పుట్టుతున్నాయి. ఊపిరాడడం కష్టంగా వుంది.

తరుణేశ్వర్ కత్తిని చేతపట్టుకుని వచ్చి భార్య కెదురుగా ఝళిపించాడు, క్రూరంగా చూస్తూ!

సుగంధి బిత్తర పోయింది, భర్త చేతిలో కత్తిని చూడగానే! పై ప్రాణాలు పైనే ఎగిరి పోయినంత పనయింది!

భయంతో అటుయిటు కదలబోయింది. కాళ్ళూ చేతులూ కదల్లేకపోయాయి బంధించడం మూలంగా. అరవబోయింది. అరవలేకపోయింది, నోట్లో గుడ్డలు కుక్కబడి వుండడం మూలంగా.

బెదురు చూపులతో భర్తను చూచింది, సుగంధి.

"ఏం ఆశ్చర్యపోతున్నావా?!" గర్జించాడు తరుణేశ్వర్, సుగంధిని మింగేసేటట్టు చూస్తూ.

తన భర్తను విచిత్రపోయి చూచింది, సుగంధి.

"నీ వనుకున్నంత చవటను కాను. నాకూ రోషం, పౌరుషం వుంది. ఆత్మాభిమానం చావ లేదింకా, నాలో!" అంటూ ఉత్తిమి చూస్తూ కత్తి మొనను సుగంధి కంఠం మీద మోపాడు.

తరుణేశ్వర్ రొప్పుతున్నాడు, ఆగ్రహావేశాలతో.

ఉడికిపోతున్నాడు కసితో.

సుగంధి గిజగిజ లాడిపోయింది, కత్తి కంఠంలో దిగబడు తుందని.

"ఊ... చెప్పు, చంప మంటావా? నిన్ను చంపడానికి నీ వద్దనే అనుమతి అడుగుతున్నానని ఆశ్చర్యపోకు! నీ వింత కాలం నాకు భార్యగా ఉండి కష్ట సుఖాల్ని రుచి చూపిన దానవు. ఆ విశ్వాసంతోటే, నిన్ను అడిగి చేయా లను కుంటున్నాను, హత్య!!" అంటూ తరుణేశ్వర్ సుగంధి ఆలోచించుకోడానికి తా విచ్చాడు.

సుగంధి గుండెలు దడదడలాడిపోయాయి, కనుగ్రుడ్లు మిడకరించి చూస్తూ వుండిపోయింది.

"చావడానికి నీ కిష్టం లేదా? చెప్పు, విడాకులు ఇచ్చు కుందాం. విడాకులు ఇచ్చుకోడానికి నామర్దా అనుకుంటావా,

విడాకులు ఇచ్చుకోకుండా ఎవరి దారి వాళ్ళం చూచుకుందాం! మొత్తానికి ఈ రోజు మనిద్దరి మధ్య ఉండే బంధం తెగి పోవాలి, శాశ్వతంగా! అర్థమైందా? నీ నోట్లో గుడ్డను తీస్తాను, అరవడానికి ప్రయత్నించావో ఈ కత్తి కసుక్కున నీ గుండెల్ని, గొంతుని గుచ్చేస్తుంది, జాగ్రత్త!" హెచ్చరించాడు తరుణేశ్వర్ రౌద్రావేశాలతో, సుగంధి నోట్లోని గుడ్డను వెలికితీస్తూ.

"నువ్వా ఒక మనిషివేనా?" అరిచింది సుగంధి. నోటి లోకి తడిని తెచ్చుకుంటూ.

"రాస్కెల్..." అంటూ తరుణేశ్వర్ సుగంధి చెంపను ఛెళ్ మనిపించాడు.

"నేను మనిషిని గనకనే నువ్వు నా అర్థాంగి వన్న అర్థంతో నిన్నడుగుతున్నాను, ఏం చేయమంటావని!"

"ఏమిటిదంతా, నీకు పిచ్చి పట్టిందా?" అయోమయంగా అడిగింది సుగంధి.

"పిచ్చి పట్టి వుంటే, చచ్చి వుండేదానివీపాటికే! నేనడిగిన దానికి బదులు చెప్పు" గద్దించాడు, హుంకరిస్తూ.

"మీ రడిగిన వాటికి ఏ భార్యా సమాధాన మివ్వదు."

"నా భార్య సమాధాన మిస్తుందని నాకు తెల్సు!"

"నేనేమంత తెగించిన దాన్ని కాను, మీ చెల్లెలు లాగ!"

"మా చెల్లెలు ఊసు ఎత్తావో నరికేస్తాను."

"ఏం, మీ చెల్లి ప్రేమా, గీమా అని ఎవడ్నో లేప్రకెళ్ళితే మంచిదా! దాన్ని ఇంట్లోకి అడుగు పెట్టనివ్వనందుకు నేను చెడ్డదాన్నా?"

"ముమ్మాటికీ నువ్వు చెడుదానివే!"

"నాలో మీరేం చెడ్డ చూశారు?"

"నేనేమిటే, ఈ ఊరే చూస్తుంది, నువ్ మన పక్కింటి ప్రసాదుతో తిరగడం!!" పళ్ళు కొరికాడు తరుణేశ్వర్.

దిమ్మతిరిగి పోయింది సుగంధికి. తన భర్త తనకు, పక్కింటి ప్రసాదుకు అక్రమసంబధం అంటగట్టుతున్నా డేమిటి?

"అబద్ధం! సర్వ అబద్ధం!" అరిచేసింది బిగ్గరగా సుగంధి.

చెంప ఛెళ్ మని పిస్తూ, "అరవ కూడదు. మెల్లగా చెప్పు. మన మాటలు ఎవరికీ వినబడకూడదు" హెచ్చరింపు జారీ చేశాడు తరుణేశ్వర్.

"అరవక ఏం చేయమంటారు, నాకు ప్రసాదుకి రంకు తనం అంట గట్టితే మీ చెల్లెలిలా నే నేమంత నీతిబాహ్యు రాల్ని కాను" బొంగురు పోయింది సుగంధి కంఠం.

"మా చెల్లెలు పేరు ఎత్త వద్దన్నాను. దాన్ని పంపించి వేశావు. దాని మాట నీ కనవసరం, ఇక! నేనడిగిన వాటిలో నీకే దిష్టం?? ఏది చేయమంటావో చెప్పు. ఏదీ చెప్పనంటావా నీకు ప్రసాదుకి ఉన్న సంబంధాన్ని మీ పుట్టింటి వారికి చెప్పి, వీధిలో చెప్పి, అల్లరి చేసేస్తాను. ఇంట్లో నుండి నెట్టేస్తాను" కసిగా అన్నాడు.

"నేనే ఈ ఇంట్లో నుండి వెళ్ళన్నా వెళ్ళుతానుగానీ మీరు మాత్రం ప్రసాదుకి నాకు అక్రమసంబంధం వుందని అనకండి, అపోహపడకండి."

"ఏ ఆడదీ తను నీతిబాహ్యురాలినని చెప్పుకోదు భర్త ముందు ఊం...ఊం... బయలుదేరు. మాట ముల్లె సర్దుకో! నేను రైల్వే స్టేషను వరకే వస్తాను. రైలుంటే టికెట్ కొనిస్తాను. లేకుంటే నిన్నక్కడ ఒదిలిపెట్టేసి వచ్చేస్తాను. ఆ తరువాత నీ ఇష్టం..." అంటూ తరుణేశ్వర్ భార్య కట్లను విప్పేశాడు.

"నా మీద కక్షకొద్దీ గారి మీ కేవేవో చెప్పి వెళ్ళిం దండి. మీ మనసుని విరిచేసింది. నా మాట నమ్మండి. నాకు ప్రసాదుకి ఎటువంటి సంబంధమూ లేదు" కట్లు విప్పగానే తరుణేశ్వర్ కాళ్ళుపట్టుకుని వేడుకోసాగింది సుగంధి, బేలైపోయి.

"గారి...... ఆ పేరు ఉచ్చరించడానికే నీకు అర్హత లేదు. ఊ. బయలుదేరు."

"మీ రెందుకనో మారిపోయారు. నా మీద అపనింద మోపి విడిపించుకోవాలని చూస్తున్నారు. నే నెక్కడికీ వెళ్ళను, మిమ్మల్ని విడిచి" చెప్పింది, ఏడుస్తూ.

"వెళ్ళ వద్దు. కానీ ఏం చేయమంటావో చెప్పు. చంప మంటావా?" హుంకరించాడు తరుణేశ్వర్.

"ఏమండి, నన్ను క్షమించండీ??" బావురు మంటోంది సుగంధి.

తరుణేశ్వర్ గబగబ ఆమె గుడ్డల్ని సంచిలోకి కుక్కాడు. సంచిని ఆమె ముఖానికి విసురుతూ, "ఊ బయలుదేరు" అంటూ నెట్టాడు, ఇంటి వెలుపలకు.

తను మొండి కేస్తే ఏదైనా అఘాయిత్యం చేయగల ఆవేశంలో ఉన్నాడు. గనక నిదానంగా కారణం తెల్సుకుని భర్త మనసు ప్రకారం మెలగ వచ్చన్న నమ్మకంతో, సుగంధి రైల్వేస్టేషన్‌కు నడిచింది, భర్తతో.

మార్గ మధ్యలో మౌనంగానే నడిచారు.

అర్ధరాత్రి కావడం మూలంగా రైళ్లులేవు, ఆ సమయానికి.

భార్యను స్టేషనులో వదిలిపెట్టి తరుణేశ్వర్ భారం తగ్గిన వాడిలా, తేలిక మనసుతో ఇల్లు చేరుకున్నాడు.

ఇంటి తలుపులకు తాళం పెట్టి లేదు. తను మరిచిపోయి

వుంటాడని అనుకున్నాడు, భార్యను ఇంటినుండి తరిమిన ఆవేశంలో. తలుపుల్ని తెలువబోయాడు తరుణేశ్వర్.

"ఆగు!" అంటూ నల్గురు పోలీసులతో ఇన్స్పెక్టర్ ధనార్జనరావ్, తరుణేశ్వర్‌ని చుట్టు ముట్టేశాడు.

తరుణేశ్వర్ తడబడిపోయాడు, పోలీసులు చుట్టు ముట్టగానే.

"ఎందుకు?" ధైర్యం కూడగట్టుకుని అడిగాడు.

"ప్రసాద్‌ని హత్య చేసినందుకు!!" ఇన్స్పెక్టర్ చెప్పాడు గంభీరస్వరంతో.

ప్రసాద్ హత్య అనగానే తరుణేశ్వర్ గుండెలు ఢమఢమలాడిపోయాయి. అదురు బెదురులతో, సంభ్రమాశ్చర్యాలతో స్తంభించిపోయి నిలబడిపోయాడు!

మరుక్షణంలో ఏదో నిర్ణయించుకున్న వాడల్లా— తన పెదాల మీదకు చిరునవ్వు తెచ్చి పెట్టుకుని, "వెరీ గుడ్, మిస్టర్ ఇన్స్పెక్టర్! నేనెంతో అదృష్టవంతుణ్ణి! నా అంత అదృష్టశాలి ఎవరూ వుండరు. నేను దోషినే. నన్ను వురితీయండి!! నన్ను తప్పక వురితీయండి!!!" అంటూ ఏదో తృప్తితో తన చేతుల్ని ముందుకు చాచాడు జేడీలు తగిలించండన్న అర్థంతో తరుణేశ్వర్!

2

సుగంధికి దుఃఖం కట్టలు త్రెంచుకుంటూంది.

పుట్టింటి కెళ్ళాలి, పుట్టిల్లు గంపెడు పిల్లలున్న సంసారం. అంతమందిలో తనకు పూటకు ఇన్ని మెతుకులు దొరకడం, దుస్సాధ్యం.

మరి ఎక్కడికి కెళ్ళాలి?

తనకి, ప్రసాదుకి అంటకట్టిన అక్రమసంబంధం సర్వ

అబద్ధమని తన అంతరాత్మకు తెల్సు. అయితే తన భర్త ఎందుకు నింద మోపాడు? అనుమానించాడా?

ఆయన అనుమానించే విధంగా తనెప్పుడూ ఆ ప్రసాదుతో మెలగ లేదు. మరి, ఈ విపరీతం, ఏమిటి? ఏడుస్తోంది సుగంధి రైల్వే స్టేషనులో మూలగా చీకటిలో కూర్చుని.

ఏడ్వగా కారిన కన్నీటి గుండా వేదన కాస్త ఉపశమించింది. కొద్దిగా ధైర్యం కూడ కట్టుకుంది.

కట్టుకున్న పెళ్ళాన్ని లేనిపోని అపనిందలతో బయటికి గెంటితే, తను రావడం సబబు కాదనిపించింది సుగంధికి. తనకు ప్రసాదుకు ఎటువంటి సంబంధమూ లేదు. లేని సంబంధాన్ని అంటగట్టి తనని అవమాన పరచాలని, తన భర్త ఇంటి నుండి వెళ్ళగొట్టాడని ఊహించుకుంది, సుగంధి.

భర్తకు దూరమైతే తన బ్రతుకంతా వ్యర్థమైపోతుందని వ్యథిత హృదయంతో కుమిలిపోయి, ఒక నిర్ణయాని కొచ్చింది.

తను పుట్టి నింటికి వెళ్ళకూడదు. వెళ్ళితే, నానా అగచాట్లకు గురి కావలసి వస్తుంది! ఇక్కడే వుండి, ఉదయాన్నే భర్తను కల్సుకుని తాడో, పేడో తేల్చుకోవాలి, స్పష్టంగా వివరాలతో!

కోర్టు కెక్కితే జీవన భృత్తి అయినా లభిస్తుందని ఆశించింది.

రకరకాల ఆలోచనలతో రాత్రంతా రైల్వే స్టేషనులోనే గడిపేసింది.

తెల్లవారగానే బయలుదేరింది, ఇంటికి!

ఇంటి వద్ద గుమికూడిన పోలీసుల్ని, జనాన్ని చూడగానే గుండెలు జారిపోయాయి.

గబగబ జనాన్ని త్రోసుకుంటూ ఇంట్లోకి ప్రవేశించింది.

"ఏమైంది?" ఆతృతతో ఆందోళన హృదయంతో ప్రశ్నించింది, ఒక కానిస్టేబుల్ని.

"ఎవరు నువ్వు?" అడిగాడు కానిస్టేబుల్.

"నేను తరుణేశ్వర్ భార్యను."

"ఓ అలాగా...మీ ఆయన ప్రసాదుని హత్య చేశాడు, రాత్రి! సార్...సార్..." అంటూ పిలిచాడు ఇన్స్పెక్టర్ని కానిస్టేబుల్.

ప్రసాద్ హత్య గావించబడ్డాడనగానే సుగంధి స్థాణువై నిలబడిపోయింది.

"ఎవరూ?" అంటూ లోపల వున్న ఇన్స్పెక్టర్ ధనార్జనరావ్ బయటికి వచ్చాడు, సుగంధని చూస్తూ.

"ఈమే సార్! తరుణేశ్వర్ భార్య!" చెప్పాడు కానిస్టేబుల్.

"మీరేనా! రాత్రి మీ రెక్కడికెళ్ళారు?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"రెళ్ళేనేపనుకు."

"ఏ ఊరెళ్ళడానికి?"

"మా ఊరు!"

"వెళ్ళలేదేం?" అడిగాడు ఇన్స్పెక్టర్.

తటపటాయించింది, నిజం చెప్పడానికి సుగంధి. "వెళ్ళలేదు. తిరిగి వచ్చేశాను" చెప్పింది చిన్నఅబద్ధం.

"ఎన్ని గంటలకు వెళ్ళారేమిటి?"

"సుమారు రెండు గంటల ప్రాంతంలో!"

"రాత్రి రెండు గంటలకు, ఏ రైలుంది? మీకై మీరెళ్ళారా? తరుణేశ్వర్ బలవంతంమీద వెళ్ళారా?" అడిగాడు ఇన్స్పెక్టర్.

నిజాన్ని దాచలేకపోయింది. "ఆయన బలవంతం మీద నే" చెప్పేసింది.

"బలవంతం మీద మిమ్మల్ని స్టేషనుకు పంపి, ప్రసాద్ ని హత్య చేశాడు. శవాన్ని మీ బెడ్ మీద నే పడుకోబెట్టాడు. పైగా తరుణేశ్వర్ తనే హత్య చేసినట్టు ఒప్పుకున్నాడు."

"ఒప్పుకున్నారా!? ఎందుకు హత్య చేశారట?" అడిగింది సుగంధి బొంగురు కంఠంతో.

"మీకు ప్రసాద్ కు అక్రమసంబంధం వుండడం తెలియగానే తనలో కలిగిన కోపావేశాలను అణచుకోలేక ప్రసాద్ ని హత్యచేసినట్లు తరుణేశ్వర్ వాఙ్మూలం ఇచ్చాడు."

"అబద్ధం! అబద్ధం! అబద్ధం!" అరిచేసింది. ఏడుస్తోంది అరుపులతో శోకాలతో సుగంధి దీనంగా.

3

"ఎవరమ్మా? నా వద్దకు ఎందుకు వచ్చావు?" అడిగాడు ప్రముఖ ప్రయివేట్ డిటెక్టివ్ యువరాజ్, తన కెదురుగా కూర్చుని వున్న యువతిని చూస్తూ.

చెదిరిపోయివున్న తల, నిద్రలేమి మూలంగా ఎఱ్ఱగా బలహీనంగా కనబడే కళ్ళు, వాడిపోయిన పుష్పపు రేకుల్లా ఉండే ముఖకవళికలు.

"నా పేరు సుగంధి. మా ఆయన పేరు తరుణేశ్వర్. జలజ ట్రేడర్స్ లో సూపర్ వైజరుగా పనిచేస్తున్నారు. మా కుటుంబంలో జరగరాని విచిత్రమైన విపరీతం జరిగింది రాత్రి!"

అసిస్టెంటు సూరి షార్ట్ హాండ్ లో వ్రాసుకుంటున్నాడు చకచక.

"జరిగిందేమిటో చెప్పమ్మా."

"నాకూ పక్కింటి ప్రసాదుకీ అక్రమసంబంధం అంట

గట్టి మా ఆయన వెలివేయాలని నన్ను...” చెప్పింది జరిగిన దంతా, తు. చ. విడువకుండా!

డిటెక్టివ్ లిరువురూ ఆశ్చర్య చకితులైపోయారు, దిగ్భ్రమతో. “ఎటువంటి సంబంధమూ లేదు. అతను పెళ్ళికాని వాడు. నే నతనితో మాట్లాడినదే లేదింత వరకు” వేదన పూరిత హృదయంతో నివేదించుకుంది సుగంధి.

“అంత దూరంగావున్న నీకు—ప్రసాదుకి ఎలా అక్రమ సంబంధం తిరుణేశ్వర్ అంటగట్ట గలడు? అతని కేదో అనుమానం కలిగివుంటుంది, మీ ఇద్దరిమీద! అందుకే హత్య చేసి, ఒప్పుకుని వున్నాడు” చెప్పాడు యువరాజ్.

“నాకు నమ్మకం కుదరడంలేదు, ఆయన హత్య చేశా డంటే?” అంది సుగంధి.

“ఎందుకని?”

“ఆరేండ్లుగా ఆయనతో కాపురం చేస్తున్నదాన్ని. ఆయన స్వభావం, మన స్తత్వం తెల్సినదాన్ని.”

“నువ్వు చెప్పబోయే దేమిటో నా కర్థమైందమ్మా! తనే హత్య చేయడానికి గల కారణాన్ని చెప్పి తిరుణేశ్వర్ శిక్ష అనుభవించడానికి సిద్ధపడి వున్నాడు. అటువంటతన్ని నువ్వో నేనో లేక ఇంకెవరైనప్పటికి చేయగలిగిం దేమీ లేదు” అన్నాడు యువరాజ్.

“మీబోటి వాళ్ళు అలాగంటే ఎలా? మీ గురించి గొప్పగా చెప్పుకుంటూండగా విని వచ్చాను. నేను పేద రాల్ని. మీ రడిగిన ఫీజుని ఇవ్వలేను. కానీ, కలిగిన దానిని ఇచ్చుకుంటాను. నా మీద అక్రమసంబంధం అంటగట్టడం అబద్ధం. అదేవిధంగా ఆయన హత్య చేయడమూ అబద్ధం!” ఏడుస్తోంది సుగంధి బావురుమని.

యువరాజ్ కు అయోమయం అయిపోయింది. చేయని నేరాన్ని చేశానని ఎందుకు ఒప్పుకుంటాడు? ఏవైనా కుటుంబ కలతలు కారణమా?

"మీ ఇంట్లో ఇంకెవరైనా ఉన్నారాండీ?" అడిగాడు యువరాజ్.

"చెప్పాను గదండి, ఆయన చెల్లెలు గౌరి వుంది! అది ఎవర్నో ప్రేమించి, రాత్రే వెళ్ళింది" చెప్పింది సుగంధి అక్కసుగా.

"ఎవర్ని ప్రేమించింది?"

"ఫాల్గుణమూర్తిని!"

"వాళ్ళిద్దరికి పెళ్ళి చేయకపోయారా?"

"పెళ్ళి చేయమని అర్ధరాత్రిలో ఫాల్గుణమూర్తి, గౌరితో వచ్చాడండి!"

"గౌరి ఎక్కడికెళ్ళింది? మీ ఇంట్లో లేదా?" ఆశ్చర్యపోతూ అడిగాడు యువరాజ్.

"రాత్రి చావడానికని బావిలో దూకడానికి వెళ్ళిందట! అది చూసి ఫాల్గుణమూర్తి ఆమెను కాపాడి తీసుకవచ్చాడట పెళ్ళిచేసుకోడానికి! నేనొప్పుకోలేదు వాళ్ళ మాటల్ని. ఇంట్లోకి రానివ్వలేదు. వెళ్ళిపోయారు, రాత్రే! వాళ్ళు అటు వెళ్ళగానే మావారు నన్ను...నన్ను..." దుఃఖానాన్నపుకోడంలో లీనమైంది సుగంధి.

"గౌరి బావిలో దూకడానికి ఎందుకెళ్ళింది?" విచిత్రపోయి ప్రశ్నించాడు యువరాజ్.

"అంతా అబద్ధం! లేచివెళ్ళడానికి పోయి—ఇద్దరూ కూడ బలుక్కుని వచ్చారు. పెళ్ళిచేయమని! నేనందుకు చోటివ్వ లేదు" చెప్పింది సుగంధి.

"ఎందుకు?"

"లేపు కళ్ళే ఫాల్గుణమూర్తితో వెళ్ళక—తిరిగి వచ్చి పెళ్ళి చేయండని అడగడం మాకు నచ్చలేదు. ఆ పెళ్ళేదో ఏ రిజిస్ట్రార్ ఆఫీసులోనో చేసుకోండని పంపించేశాము, పెళ్ళి ఖర్చులు మిగులుతాయని!"

"వాళ్లు ఇప్పు డెక్కడున్నారు?"

"రాత్రే గదండి, వెళ్లుతా. ఎక్కడ కెళ్లారో? ఎక్కడున్నారో?" అని చెప్పింది సుగంధి.

4

"మీరు వస్తారని తెల్సి ఆగాను" అంటూ ఆహ్వానించాడు క్రైం బ్రాంచ్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ ధనార్జనరావు యువరాజ్‌ని.

"శవం ఎక్కడుంది?" అడిగాడు యువరాజ్.

"లోపల, పడగ్గదిలో!"

వెళ్ళి చూశాడు శవాన్ని, యువరాజ్. సూరి యువరాజ్ వెనుకాలే వచ్చాడు.

చాలా చిన్న పడగ్గది. మధ్య తరగతి కుటుంబీకులది గనక విశేషం లేదు, అమరికలో.

నవారున్న పట్టెమంచం మీద పరుపుంది. పరుపుమీద ప్రసాద్ శవం వెల్లికిలా వుంది. గొంతు ఉబ్బినట్టుగా వుంది. కళ్ళు కొద్దిగా వెళ్ళుకు వచ్చి ఉన్నాయి.

"చావుకు కారణం, గొంతు నులపడమా?" అడిగాడు యువరాజ్.

"కాదు, వీపులో కత్తిపోటుంది!" చెప్పాడు ధనార్జనరావు.

"మరి, గొంతు నులిపి నట్టుందే!?"

"కత్తితో పొడిచిన తరువాత గొంతుని వెనకవైపుగా వచ్చి పట్టుకుని నులిపి వున్నాడు, హంతకుడు! రెండు బొటనవ్రేలి ముద్రలు మెడ పైభాగాన ఉండగా, ఎనిమిది వ్రేళ్ళ గుర్తులు కత్తికమీద ఉన్నాయి."

"అంటే, హతుడు అలవకుండా ఉండడానికి పీకను నొక్కి వున్నారన్నమాట! ప్రాణం ఎన్ని గంటల ప్రాంతంలో పోయిందని డాక్టర్ చెప్పాడు?"

"ఒకటి ముప్పావు నుండి, రెండుంపావు లోపు ప్రాణం పోయి వుండాలని చెప్పాడు."

"కత్తితో పొడవబడి వున్నాడు. అయితే బెడ్ మీద రక్తం గోచరించడం లేదే!" అంటూ యువరాజ్ ఆశ్చర్య చకితుడై పరీక్షించాడు, పరుపుమీది దుప్పటిని.

నెత్తురు మరకలు మచ్చుకైనా లేవు.

"నాకూ బోధ పడడం లేదు. హత్య ఎక్కడో జరిగి నట్లుంది" అన్నాడు ధనార్జనరావు.

"హత్యకు ఉపయోగించిన ఆయుధం కనబడిందా?" అడిగాడు సూరి.

"ఈ ఇంట్లో ఎక్కడా కనబడ్లేదు."

"ఆయుధాన్ని తరుణేశ్వర్ ఏం చేశాడట?"

"పారేశాడట!"

"ఎక్కడ?"

"ఫలానా చోటని చెప్పడం లేదు."

తరుణేశ్వర్ హత్య చేయలేదనడానికి చాలా సాక్ష్యాలు లభిస్తున్నాయి. హత్య 1-45 నుండి 2-15 లోపు జరిగి వుంటుంది. తరుణేశ్వర్ వద్ద రెండు గంటల వరకు గౌరి ఫాల్గుణ మూర్తులువుండి ఉన్నారు. ఆ తరువాత అతని భార్య సుగంధి

వుంది రెండున్నర వరకు. రెండున్నర నుండి, మూడు గంటల వరకు ఇంట్లో ఎవరూ లేరు, దంపతు లిద్దరూ రైల్వే స్టేషనుకు వెళ్ళడం మూలంగా. అదీగాక హత్య ఎక్కడో చేసి, శవాన్ని తెచ్చి ఇంటిలో పెట్టుకోడు ఏ హంతకుడు.

“తరుణేశ్వర్ని అరెస్ట్ చేశారా?” అడిగాడు యువరాజ్.

“హత్య చేసింది తనేనని ఒప్పుకున్నాడు. అరెస్ట్ చేయకుండా ఎలా ఉండ గలను?!”

“ఇక్కడ హత్య జరిగినట్లు మీ కెలా తెల్సింది?”

“ఎవరో ఫోన్ చేసి చెప్పారు.”

“ఏమని?”

“ఈ ఇంట్లో కేకలు వినబడ్డాయని, కేకలు బట్టి చూస్తే హత్య జరిగి వుంటుందని గట్టిగా, ఖచ్చితంగా చెప్పాడతను మమ్మల్ని రమ్మని.”

“చెప్పినది ఎవరైంది తెల్సుకున్నారా?”

“అప్పుడే ఫోనులో అడిగితే - తనొక సామాన్య పౌరుడ్నని - పౌరబాధ్యతను నిర్వహిస్తున్నానని ఉపన్యాసధోరణిలో చెప్పాడట!”

తల పంకించాడు యువరాజ్, ఏదో ఊహించుకుంటూ.

“హతుడు ప్రసాద్ ఇల్లు ప్రక్క ఇల్లే గదా! ప్రసాద్ని గురించి వివరా లేవైనా సేకరించారా?” అడిగాడు నూరి.

“ఇంకా లేదు. కానీ ప్రసాద్ తండ్రి పూర్ణానందం గురించి మా డిపార్టుమెంటుకు కొన్ని రిపోర్టులు అంది వున్నాయి. పూర్ణానందం అప్పుడప్పుడు కొందరు అమ్మాయిలతో అబ్బాయిలను చేర్చి - భార్యా భర్తలని చెప్పి లాడ్జింగులలో గది అద్దెకు తీసుకుని విడిచి పెట్టుతాడట!”

“విచిత్రంగా వుందే!” అన్నాడు నూరి చిఱునగవుతో.

"అవును సూరీ! పూర్ణానందం అమ్మాయిల్ని, అబ్బాయిల్ని లాడ్జింగ్ రూములలో వదలడం మాకు ఉత్తరం మూలంగానూ, ఫోన్ ద్వారానూ తెల్సింది."

"మీరు ఏక్షన్ తీసుకోలేదా?"

"నేను తీసుకోలేదు. డివిజనల్ పోలీస్ స్టేషన్‌కు తెలియజేశాను, అక్కడి ఎస్. ఐ. నుండి నాకింకా రిపోర్టు అందలేదు."

యువరాజ్ శవం వీపు భాగాన్ని పరీక్షించాడు. అక్కడక్కడ ఇసుక రేణువులు అంటి వుండడం చూశాడు. పడక మీద చంపబడి వుంటే ఇసుక అంటడానికి అవకాశం లేదు. గనక హత్య ఇసుక ఉన్న ప్రదేశంలో జరిగి వుండాలి.

హత్య ఇసుక ఉన్న ప్రదేశంలో జరిగి వుంటే – శవమూ అక్కడే వుండి వుండాలి. ఇక్కడి కెలా వచ్చింది? తీసుకుని వచ్చి ఉండాలి. శవాన్ని చంపిన చోట వదలకుండా ఇక్కడకు ఎందుకు తెచ్చారు? భద్రంగా పడక మీద ఎందుకు పడుకోబెట్టారు!

"మిస్టర్ ధనార్జనరావ్! ఈ హత్యను తిరుణేశ్వర్ చేయలేదని గట్టిగా చెప్పగలను, వాదించగలను, నిరూపించగలను," అన్నాడు యువరాజ్.

"అయితే హత్య చేసిందెవరు? హత్య చేయని తరుణేశ్వర్ తనే హత్య చేసినట్టు ఎందుకు ఒప్పుకుని, శిక్షను అనుభవించడానికి తయారయ్యాడు?" అడిగాడు ధనార్జనరావు.

"ప్రసాద్‌ని హత్య చేసిందెవరో పరిశోధన మీదట బయట పడుతుంది. తరుణేశ్వర్ ఎందుకు హత్యానేరాన్ని మీద వేసుకుంటున్నాడో, గౌరి ఫాల్గుణమూర్తులను కల్సుకుంటే చెప్పగలను," చెప్పాడు యువరాజ్.

"తరుణేశ్వర్ రైల్వే స్టేషన్నుండి రాగానే తలుపుల వద్దనే అటకాయించాను. సంకెళ్ళను చేతులు చూస్తూ, 'నేను దోషిని. నన్ను వురితీయండి! నన్ను తప్పక వురితీయండి!!' అంటూ పిచ్చిగా వాగాడు" చెప్పాడు ధనార్జనరావు.

"ఉఁ...ఊఁ...అలాగా...!" తల పంకించి, "అంటే తరుణేశ్వర్ని ఇంటి లోనికి రాకముందే అరెస్ట్ చేసారన్న మాట! అయితే ఈ శవం ఈ ఇంట్లో ఉన్నది అతనికి తెల్సి వుండదే!!"

"ముందు తెలియదు. తెల్సిన తరువాత సుగంధి వద్ద ప్రసాద్ వుండడం చూచి చంపాలన్నాడు తరుణేశ్వర్."

"సుగంధి అతనితో స్టేషనుకు వెళ్ళితే ప్రసాద్ వద్ద ఎలా వుంటుందట, ఫూల్!" అన్నాడు సూరి.

"ప్రసాద్ని తరుణేశ్వర్ హత్య చేయలేదని రూఢిగా తెల్సిపోయింది. అయితే ప్రసాద్ని హత్య చేసిం దెవరు? మన పరిశోధన ముందుకు సాగడానికి ప్రసాద్ వ్యక్తిగత విషయాలు, రాత్రి ఎక్కడికి కెళ్ళాడు? ఎక్కడున్నాడు? ఆరాతీయాలి. పైగా అతని తండ్రి పూర్ణానందం అమ్మాయిల్ని అబ్బాయిల్ని కలిపి భార్యాభర్తలుగా చెప్పి లాడ్జింగుల్లో వదులుతున్నారంటున్నారు. వివరాలు తెల్సుకోవాలి రండి" బయలుదేరారు పక్కింటి పూర్ణానందం వద్దకు!

5

పూర్ణానందం యాభయ్యోపడిలో పడ్డ వ్యక్తి!
అతని భార్య అనంతనాయకికి నలభై వయస్సుంటుంది.

ఇద్దరి ముఖాల్లోను కత్తిగాటుకు నెత్తురుచుక్క లేదు. అనంతనాయకి ఏడ్వడం మూలంగా ముఖమంతా జేవురించి పోయివుంది.

అన్నిటిని త్యజించుకుని వరదల్లోపడి కొట్టుకెళ్ళు వ్యక్తుల్లా గోచరించారు. అసలే వృద్ధాప్యం! ఒక్కగా నొక్క కొడుకు హత్య చేయబడ్డా డనగానే రోగ పీడితుల్లా ఇంకా కుంచించుకు పోయారు భరింపరాని వేదనతో.

డిటెక్టివ్ యువరాజ్, అసిస్టెంట్ సూరి, ఇన్స్పెక్టర్ ధనార్జనరావు ఒక్కసారిగా ఇంట్లోకి అడుగు పెట్టారు. ముగ్గురూ ఆశ్చర్యపోయారు ఆ ఇంటిని చూచి.

చాలా చాలా చిన్న ఇల్లు! రెండే రెండు గదు లున్నాయి! ఒకటి వంట గది. మరొకటి పడక గది. ఆ గదిలో మంచాలు రెండు, పరుపులు, దిండ్లు, దండానికి వ్రేళ్ళాడే గుడ్డలు, ట్రంకు పెట్టెలు - ఇంకా ఇతర సామాన్లు సీసాలో ఉండే మందు బిళ్ళల్లా వున్నై!

కూర్చోడానికి చోటులేక అలాగే నిలబడి పోయారు ముగురూ.

"రాత్రి మీ ప్రసాద్ ఎక్కడి కెళ్ళాడు?" అడిగాడు ధనార్జనరావు.

"సినిమాకు, రెండో ఆటకి!" చెప్పాడు పూర్ణానందం.

"సినిమాకు వెళ్ళిన వాడు తిరిగి రాలేదా?" అడిగాడు యువరాజ్.

"రాలేదట!"

"అంటె, మీరు ఇంట్లో లేరా, రాత్రి?"

"లేను. నేనూ సినిమా కెళ్ళాను, పెద్దమ్మాయి, అల్లుడితో."

"ఓహో. మీ ఆవిడ వుందన్న మాట! రాత్రి మీరంతా ఎన్ని గంటలకు వచ్చారు?"

"మేమంతా రాలేదు. నేనొక్కడ్నే వచ్చాను ఇంటికి పెద్దమ్మాయిని, అల్లుడ్ని లాడ్జింగ్ లో విడిచిపెట్టి!!"

"లాడ్జింగ్‌లో విడిచి పెట్టారా, ఎందుకు?" ఆతృతను అణుచుకోలేక అడిగాడు ధనార్జనరావు.

"మా ఇల్లు చాలా చిన్నది. ఈ చిన్న ఇంట్లో నేను మా ఆవిడ, అబ్బాయి పడుకోడానికే ఇబ్బంది, అటువంటి ఈ ఇంట్లో అల్లుణ్ణి, అమ్మాయిని ఎలా పడుకో పెట్టుకో గలం??"

"అందుకని?"

"లాడ్జ్‌లో గదిని అద్దెకు తీసుకుని వసతిని ఏర్పాటుస్తాను, పెద్దమ్మాయి, రెండో అమ్మాయి భర్తలతో వచ్చినప్పుడల్లా! మా కుటుంబ పరిస్థితి మూలంగా అల్లుళ్ళకు లోటు, ఇబ్బంది కల్గకుండా ఎప్పుడో వాళ్ళు వచ్చినపుడు తగిన సౌకర్యాలను అందివ్వడం, నా బాధ్యత. నా యీ చర్యను చాలా మంది తప్పుగా లెక్కించడం వాళ్ళ పొరబాటు" చెప్పాడు పూర్ణానందం.

ధనార్జనరావు బిక్కముఖం పెట్టినంత పన్జేశాడు.

"రాత్రి మీరు లాడ్జ్ దగ్గనుండి ఎన్ని గంటలకు ఇల్లు చేరుకున్నారు?" అడిగాడు యువరాజ్.

"సినిమా వదలగానే లాడ్జ్ కెళ్ళి, ఇంటికొచ్చేశాను, కాసేపు కుటుంబ విషయాలు మాట్లాడుకుని! టైం రెండు దాటి వుంటుంది."

"ఆ సమయంలో ఇక్కడ మీ కెవరైనా కన్పించారా?"

"ఎవరూ నా కగు పడలేదు. కానీ ప్రక్కింటి నుండి అలుపులు, కేకలు వినబడ్డాయి. నేను విన్పించుకోలేదు, మా ఆవిడతో పెద్దమ్మాయి కాపురాన్ని గూర్చి ముచ్చటించు కుంటూ! అబ్బాయి రాలేదేం ఇంకా_ అని నేను, మా ఆవిడ చాలా సేపు ఎదురు చూసి _ చూస్తూ నిద్రపోయాం! తెల్లవార

గానే, ఈ దారుణం!" నోటికి పైగుడ్డను అడ్డం పెట్టు కున్నాడు దుఃఖంతో పూర్ణానందం.

"తరుణేశ్వర్ తన భార్య సుగంధితో ప్రసాద్ కు అక్రమ సంబంధం వుందని చెప్తున్నాడు. మీరేమంటారు?" అడిగాడు యువరాజ్.

"అదంతా ఒట్టి కల్పితం. సత్యహరిశ్చంద్రుడి మీదైనా అపనిందను మోపవచ్చు, కానీ ప్రసాద్ మీదా, సుగంధి మీదా అపనింద మోపడం అక్రమం! ఎందుకంటే కొడుకుగా ప్రసాద్ ని గురించి, పక్కింటి ఇల్లాలుగా సుగంధిని గురించి నాకు బాగా తెల్సు" అంటూ పూర్ణానందం, ఇంకా వాళ్ళల్లోని నైర్మల్యాన్ని గురించి బల్ల గుద్ది చెప్పినట్టుగా చెప్పాడు వివరంగా.

"ప్రసాద్ స్నేహితులలో విరోధులో, పగవారో వున్నట్టు మీ కెవరి మీదైనా అనుమానం ఉంటే చెప్పండి!" అన్నాడు యువరాజ్.

"నాకు తెల్సినంత వరకు ఎవరూ లేరు. మా అబ్బాయి భోగి కాదు, త్యాగి! గనక, ఒకర్ని నొప్పించడు. తానొవ్వినా! నష్టపడ్డా విరోధం తెచ్చుకోడు ఏ విషయంలోను, ఎవరితోను" చెప్పాడు పూర్ణానందం.

"రాత్రి సినిమాకు అందరూ కల్సే వెళ్ళారా?"

"లేదండి, మేము వెళ్ళింది చిత్రా టాకీస్ కి!"

"అయితే, ప్రసాద్?"

"అజంతాకు, వెళ్ళుతానన్నాడు."

"మీతో సినిమాకు రాక, అజంతాకు ఎందుకు వెళ్ళాడు? ఎవరైనా స్నేహితుడితో కల్సి వెళ్ళాడా?"

"జనమేజయంతో కల్సి వెళ్ళి వుండొచ్చు. ఎందుకంటే వారిద్దరు క్లోజ్ ఫ్రండ్స్!"

"జనమేజయం ఇల్లెక్కడ?"

"బీచ్ లైన్ దగ్గర్లో!"

యువరాజ్ మనస్సు గతుక్కుమంది, బీచ్ లైన్ అనగానే!

శవానికి అంటి వున్న ఇసుక, జనమేజయాన్ని గూర్చి రకరకాల ఆలోచనలతో, ఊహాలతో వూగింప జేసింది.

"జనమేజయం మీ యింటికి వస్తూ ఉంటాడా?"

"ఇద్దరూ ఒకే చోట పని జేస్తున్నారు. అపుడపుడూ వస్తుంటాడు. మా వాడూ వాళ్ళింటికి వెళ్తుంటాడు."

అనంతనాయకిని కొన్ని ప్రశ్న లడిగాడు యువరాజ్. ఆమె తన కేమీ తెలియదని చెప్పింది, దుఃఖంతో. కానీ పక్కింటి నుండి భార్యా భర్తల కీచులాటను విన్నట్టు చెప్పింది.

తరుణేశ్వర్ ఇంట్లో నుండి పెద్దపెద్దగా ఏడ్పులు విన్పించాయి.

అప్పుడే ఒక కానిస్టేబుల్ వచ్చాడు, సెల్యూట్ చేస్తూ.

"సార్! గౌరి, ఫాల్గుణమూర్తులట - వచ్చారు సార్!!" చెప్పాడు కానిస్టేబుల్.

"వెరీ గుడ్. వస్తున్నాం-పద!" అన్నాడు యువరాజ్.

6

ఏదో ప్రమాదానికి గురై అపస్మారక స్థితిలో వున్న వ్యక్తుల్లా గోచరించారు గౌరి ఫాల్గుణమూర్తులు.

చూచీ చూడగానే చక్కని జంటనింపించింది యువరాజ్ కు.

యూనిఫాంలో ఉన్న ధనార్జనరావుని చూడగానే గౌరికి భయం పుట్టుకొచ్చింది. "మా అన్నయ్య ఈ హత్య చేసి వుండడు" చెప్పింది చేతులు జోడిస్తూ, గౌరి.

"ఇంకెవరు చేసి వుంటారు?" అడిగాడు ధనార్జనరావు.

"ఏమో నండి" బిత్తర పోయింది గౌరి.

"శవం మీ ఇంట్లో వుంది. చంపింది తనేనని ఒప్పు కున్నాడు తరుణేశ్వర్!" చెప్పాడు ధనార్జనరావు.

"అబద్ధం!"

"అయితే, నిజం చెప్పండి, రాత్రి జరిగిం దేమిటో?" అన్నాడు యువరాజ్.

గౌరి చెప్పడం ప్రారంభించింది:

*　　　*　　　*

గౌరి అంటే లేశమైనా గిట్టదు, సుగంధికి!

అందుకు కారణ మేమిటో గౌరికి ఇంత మటుకు తెలియ రావడం లేదు.

ఇంటి చాకిరి అంతా గౌరి ఒక్కతే చేస్తుంది, ప్రొద్దున్న నిద్ర లేచిన దగ్గర్నుంచి - పడుకోబోయేంత వరకు.

పాచి పని, అంట్లు తోమడం, కాఫీ పెట్టడం, టిఫిన్ తయారుచేయడం, వంటావార్పు, బట్టలకు సబ్బు పెట్టడం, పెరట్లో ఉన్న పూలమొక్కలకు నీరు పోయడం లాటి పనులన్నీ గౌరి యాంత్రికంగా చేసుకుపోతుంది రోజూ.

సుగంధి ఒక్క పనీ ముట్టుకోదు. ఇంటి కొచ్చిన కొత్త చుట్టంలా కుర్చీలో కూర్చునో, మంచం మీద పడుకునో, చదువుకుంటూనో ఉంటుంది.

సుగంధి మాటను గౌరి ధిక్కరించినది లేదు, ఎప్పుడూ. వినయవిధేయతలు ప్రకటించని క్షణం లేదు. కానీ సుగంధికి గౌరి అంటే అసూయ, ద్వేషం!

అసూయాద్వేషాలు ఉండబట్టే కాబోలు - గౌరికి మంచి సంబంధం కోసం వెదికే తరుణేశ్వరుతో సుగంధి తగాదాకు దిగింది!

తరుణేశ్వర్‌కు తన చెల్లెలు గౌరి అంటే పంచప్రాణాలు. చిన్నప్పటి నుండి అల్లరి చిల్లరి వయసులో అనురాగాల ప్రవంతిలో పెరిగిన వారు. ఒకరి మీద మరొకరికి మమకారం!

అమ్మ నాన్నలు గతించిన పిదప గౌరి అన్నయ్య వద్దనే వుండిపోయింది.

గౌరి కలవారి ఇంటికి కోడలుగా వెళ్ళాలని తరుణేశ్వర్ కలలు గన్నాడు. కలలన్నీ కల్లలై పోయాయి, మార్కెట్టులో పలికే కట్నాల ధరలు గమనించగా.

కనీసం నుంచి సంబంధానైనా చూచి గౌరిని ఇల్లాలిని చేసి పంపాలనుకున్నాడు.

"మంచీ లేదు, గించీ లేదు. ఎవడికో ఒకడికిచ్చి ముడి పెట్టించి బయటికి పంపండి. కట్నాలు కానుకలు ఇవ్వడానికి మనవద్ద భూషణాలు నిండిన భోషాణాలు లేవు. ఉద్యోగస్తుడో, శ్రీమంతుడో కావాలని కాచుక్కూర్చోడానికిదేమీ ధర్మసత్రం కాదు. వయసైన పిల్లను ఇంట్లో పెట్టుకోవడం సిగ్గుచేటు!" అని మండిపడింది సుగంధి.

"మా చెల్లెలు అద్దంలాటిది. అద్దాన్ని గుడ్డివాడికిచ్చేంత అవివేకిని కాను, నువ్వు నీ బోడిసలహా ఇచ్చినంతమాత్రాన!"

రానురాను గౌరిని ఎలాఎలా బాధించాలో, కష్టపెట్టాలో ఆ విధంగా శ్రమకు గురి చేసింది సుగంధి నిర్దాక్షిణ్యంగా.

గౌరి తలితండ్రులను తలచుకుని ఏడ్చేడ్చి కుమిలిపోవడం మాత్రం చేయగలిగింది, వదిన పెట్టే బాధలకు.

గుట్టుగా ఇంట్లో వంటింటి పొయ్యిలా కదలక మెదలక గౌరి ఉండడమూ సుగంధికి గిట్టలేదు. అందుకే, సలహా యిచ్చింది, ఎవడినైనా ప్రేమించమని!!

గౌరి ఎవర్ని ప్రేమించగలదు? ఎలా ప్రేమించగలదు? ప్రేమించి పెళ్ళాడమంటుంది సుగంధి, ఖర్చులుండవన్న దురుద్దేశంతో.

అంతే కాదు, సుగంధి తన కోపాన్ని, ఆవేశాన్ని అణచుకోలేక ఎవడ్నో ఒకడ్ని లేపుకెళ్ళమని పురమాయిస్తుంది గౌరిని!

గౌరి లోలోపల కుమిలిపోయింది, తన దురదృష్టానికి వగచి. వదిన పెట్టే బాధలను, సూటి పోటి మాటలను భరించలేకపోయింది.

చివరకు, అన్నయ్య ఫ్రెండ్ అయిన ఫాల్గుణమూర్తిని ప్రేమించాలని నిశ్చయించుకుంది.

ప్రేమించాలని అనుకోగానే గౌరి గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. ఫాల్గుణమూర్తిని చూడ్డానికి సిగ్గుపడిపోయేది.

ఫాల్గుణమూర్తి రోజూ ఆఫీసుకు వెళ్ళేటప్పుడు, ఆఫీసు నుండి వచ్చేటప్పుడు గౌరి ఇంటిముందుగానే వెళ్తాడు.

గౌరి అతని రాకకోసం ఎదురుచూచేది అదిరే హృదయంతో.

ఫాల్గుణమూర్తిని తను ప్రేమించాలి. ఎలా ప్రేమించాలి? ప్రేమించాలంటే ఏంచేయాలి? గౌరికి అర్థం కాలేదు. ఆలోచించుకుంది.

చూపుల్లో కనబరచాలా?అయితే, అతగాడ్ని ఎలా చూస్తే తనని ప్రేమిస్తాడు?చాటుగా అద్దంముందు నిలబడి రిహార్సల్ చేసుకుంది. రిహార్సల్ మాదిరి ఫాల్గుణమూర్తిని చూడగానే చూడ్లేకపోయింది. అందుకు కారణం సిగ్గా? బిడియమా? లజ్జా? గౌరికి తెల్సిరాలేదు.

ఫాల్గుణమూర్తి రాకకోసం తపించిపోయేది. తీరా రాగానే జంకిపోయేది, చూడ్డానికి.

ఎలాగో ఫాల్గుణమూర్తిని చూడడం నేర్చుకుంది. ఫాల్గుణమూర్తి గౌరిని కన్నెత్తి చూడడం వరకే చేసేవాడు. అతని చూపుల్లో ఎటువంటి భావాలూ వుండేవి కావు.

ఒక రోజు అప్రయత్నంగా, "తరుణేశ్వర్ వున్నాడా?" అని అడుగుతూ ఇంట్లోకి వచ్చేశాడు ఫాల్గుణమూర్తి.

గౌరి గుండెలు ఝల్లుమన్నాయి. అవ్యక్తభయంతో అలమటించి పోయింది. ఫాల్గుణమూర్తితో మాట్లాడాలని, తను ప్రేమించడం చెప్పాలని అనుకుంది, హడావిడి పడ్తూ.

ఫాల్గుణమూర్తిని కూర్చోమంది, తడబడుతూ.

ఫాల్గుణమూర్తి కూర్చోగానే, ప్రక్కగా వెళ్ళి నిలబడి, "ఏమండి మిమ్మల్ని నేను మనసారా ప్రేమిస్తున్నాను" అని చెప్పేసింది. ఆ మాటలు అనడానికి ఆమె ఎన్ని అవస్థలు పడ్డదో ఆ పరమాత్మునికే ఎరుక!

ఆ మాటతో ఫాల్గుణమూర్తి అదిరిపోయాడు. అంతలోనే కోపగ్రస్తుడైనాడు.

"ఛీ...ఛీ! మీ ఇంట్లోకి వచ్చినంత మాత్రాన ప్రేమిస్తావా? నన్నేనా? నాలాంటి యువకుల్ని కూడా ప్రేమించి ఉన్నావా? నిన్ను నాకిచ్చి కట్టబెట్టాలని మీ అన్నయ్య ప్రయత్నిస్తుంటే...ఏమో ననుకున్నాను. ఇపుడర్థమైంది," అని తలపంకిస్తూ చురచురలాడుతూ నిలబడ్డాడు, గౌరి స్వభావం మంచిదికాదని.

గౌరి స్థాణువై నిలబడిపోయింది. గౌరికి ప్రేమంటే ఏమిటో తెలియదు. తరుణేశ్వర్ తనకోసం వివాహానికి ఒప్పించు యువకునివద్ద అవమానం పొందగానే గౌరి ఆత్మాభిమానం దెబ్బతింది. తనకిక వివాహం కాదని చేలైపోయింది.

గౌరి ఫాల్గుణమూర్తికి ఏదేదో చెప్పి గొంతెత్తి అరవాలనుకుంది, ఆవేశంగా. కానీ అప్పటికే ఫాల్గుణమూర్తి వెళ్ళిపోయాడు అసహ్యంతో.

గౌరికి దుఃఖం, విరక్తి కలిగింది. అన్నయ్యకు తెలిస్తే ఏమంటాడన్న భయం పెనుభూతమై బాధించసాగింది. మనసులోనే కుమిలిపోయింది, తన దురదృష్టానికి!

ఆ రాత్రి అన్న వదినెలు పడుకోగానే - మెల్లగా లేచి బయలుదేరింది, బావిలో దూకి చావడానికి!

మనసులో గౌరిని భార్యగా తలచి కనిన కలలన్నీ కరిగిపోగానే ఫాల్గుణమూర్తి, వేదనకు గురైయ్యాడు.

భోంచేయలేకపోయాడు,ఆకలిలేక!నిద్రపోలేకపోయాడు. సినిమా కెళ్ళాడు, మనశ్శాంతికి.

సినిమా వదలగానే ఎక్కడో టీ తాగి, వస్తూవుండగా గౌరి చీకటిలో వెళ్ళడం కనబడింది అతడికి. విభ్రాంతుడై అనుసరించాడు.

గౌరి నూతి గోడమీదకు ఎక్కగానే, పరుగునవెళ్ళి పట్టుకుని కిందకు లాగేశాడు, ఫాల్గుణమూర్తి!

ఫాల్గుణమూర్తిని చూడగానే గౌరి అతని కాళ్ళమీద పడి భోరునఏడ్చేసింది, పసిపిల్లలా! ఫాల్గుణమూర్తి ఉక్కిరిబిక్కిరైపోయాడు, అయోమయంతో.

"ఏమండీ! నాకు నిజంగా ప్రేమించడం చేతకాదండీ! మా వదిన చెప్పిందండి, ప్రేమించమని..." అంటూ గౌరి అమాయకంగా అంతా చెప్పి కుళ్ళికుళ్ళి ఏడ్చేసింది.

ఆమె అమాయకత్వానికి ఫాల్గుణమూర్తి ముగ్ధుడైపోయాడు.

ఇంటివద్ద విడిచిపెడ్తే మళ్ళీ అఘాయిత్యానికి పాల్పడుతుం

దేమోనని, ఫాల్గుణమూర్తి గౌరితో పాటు ఆమె ఇంటి కొచ్చాడు.

తరుణేశ్వర్ కి, సుగంధికి నిజం చెప్పేస్తూ - తను వివాహం చేసుకుంటానని చెప్పాడు ఫాల్గుణమూర్తి, రాత్రి.

అందుకు సుగంధి అగ్గిగుగ్గైపోయింది. గౌరిని నానా మాటలతో ఆడిపోస్తూ, ఇంట్లోకి రావద్దని శాసించింది.

తరుణేశ్వర్ ఎంత చెప్పిచూచినా, సుగంధి వినలేదు. అరవడం ఎక్కువైంది. తిట్టడం ఎక్కువైంది.

సుగంధి రాకాసితనం ముందు తరుణేశ్వర్, ఫాల్గుణమూర్తులు తలొగ్గక తప్పలేదు.

"బాధపడకండి మీరు. ఇదోరకం వివాహం! నేను, గౌరి రిజిస్టర్ మారేజ్ చేసుకుంటాం" అంటూ ఫాల్గుణమూర్తి, గౌరిని వెంటతీసుకెళ్ళాడు తన రూముకి.

అన్నయ్య రానిదే తను వివాహం చేసుకోనని పట్టుపట్టడం మూలంగా - గౌరితో ఫాల్గుణమూర్తి, తరుణేశ్వర్ ఇంటి కొచ్చాడు, తెల్లవారగానే—!

* * *

"మీరు చెప్పిన కథలో ప్రసాద్ పాత్ర లేదేమిటి" అడిగాడు యువరాజ్.

"లేదు గనక చెప్పలేదు. మా వదిన ఎంత గయ్యాళి దైనా అటువంటిదికాదు" చెప్పింది గౌరి, ఖచ్చితంగా— నమ్మకంతో.

"అయితే తరుణేశ్వర్ ఎందుకలా అంటున్నాడు?"

"ఏమో, నాకూ అర్థంకావడం లేదండి!"

"వింతగా ఉందమ్మాయ్! మీలో ఎవరైనా ప్రసాద్ ని చూశారా రాత్రి?"

"లేదండి" చెప్పారు ఫాల్గుణమూర్తి, గౌరి.

"ఆఁ...ధనార్జనరావుగారూ! మీరేం చేయబోతారు?" అడిగాడు యువరాజ్.

"ఏం చేయాలో మీరే చెప్పాలి. ఈ శవం ఇక్కడ చంపబడింది కాదు. ఎక్కడో చంపి శవాన్ని ఇక్కడ పెట్టినట్టు ప్రత్యక్షంగా కనబడుతూంది. తరుణేశ్వర్ చంపలేదని సాక్ష్యాలు,ఎలిబీలు వున్నై. కానీ తనే హత్యచేసినట్టు తరుణేశ్వర్ ఒప్పుకుంటున్నాడు. విచిత్రంగావుంది. అయోమయంగా వుంది" అన్నాడు ధనార్జనరావు.

"తరుణేశ్వర్ హంతకుడు కాదని తెలుస్తూంది గనక— అసలైన హంతకుడ్ని బంధిస్తే ఈ కేసు పూర్తవుతుంది" చెప్పాడు యువరాజ్.

7

ప్రయివేటు డిటెక్టివ్ లని తెలుసుకోగానే జనమేజయం బిత్తరపోయి, "నావద్ద కెందుకొచ్చారు?" అని అడిగాడు.

"రాత్రి ప్రసాద్ హత్యచేయబడ్డాడు" చెప్పాడు సూరి.

జనమేజయం స్థాణువై నిలబడిపోయాడు. "ప్రసాద్ హత్యచేయబడ్డాడా!ఇంపాజిబుల్ ...!!"అన్నాడు పెద్దగా.

"ఎందుకని ఇంపాజిబుల్ అంటున్నారు?" అడిగాడు యువరాజ్.

"ప్రసాద్ అంతటి సాధువు, అంతటి అణకువతనం, గల వ్యక్తికి మరొకరు వుండరని నా వుద్దేశం."

"కొన్నికొన్ని సందర్భాలలో సాధుతనం, అణకువతనం, పిటికితనం ప్రాణాల్ని తీసేస్తాయి, అందులో అతిశయోక్తి లేదు. మీరు రాత్రి అజంతాకు సినిమా కెళ్లారు గదా! మీరిద్దరేనా? మీతో మరెవరైనా వచ్చారా?" అడిగాడు యువరాజ్.

"మేం ఇద్దరమే వెళ్ళాం. మాతో ఎవరూ రాలేదు"

"పిక్చర్ వదిలిపెట్టగానే మీ రిద్దరూ ఎక్కడ విడివడి పోయారు, ఇళ్ళకు వెళ్ళడానికి!"

"బీచ్ లెన్‌వద్ద!"

"మిస్టర్ జనమేజయం! ప్రసాద్ శవానికి ఇసుక రేణువులు అంటి వున్నాయి. అంటే బీచ్ లైన్ వద్దనే హత్య సంభవించి వుండాలి. గనక మీరు నిజం చెప్పడం చాలా చాలా మంచిది" హెచ్చరించాడు సూరి, అర్థోక్తిగా!

"ప్రస్తుత పరిస్థితుల్లో నిజాన్ని చెప్పడం చాలా చాలా అవసరమనీ నాకు తెల్సండి. ప్రసాద్ నాకు ప్రాణస్నేహితుడు. అటువంటి మిత్రుడ్ని హత్యచేసిన హంతకుడ్ని బంధించి తగిన శిక్షను విధించేంతవరకు, నాకూ నిద్రపట్టదు" చెప్పాడు జనమేజయం.

"అయితే, ప్రసాద్‌ని గూర్చి మీకు తెల్సిన వ్యక్తిగత విషయాలు చెప్పండి. స్నేహితులలో గిట్టనివా రెవరైనా వుంటే చెప్పండి. మీ కెవరిమీదైనా అనుమానం ఉంటే చెప్పండి" అడిగాడు యువరాజ్.

చెప్పాడు జనమేజయం ప్రసాద్‌ని గురించి, అతడి స్నేహితుల గురించి, వివరంగానూ, విపులంగానూ.

అనుమానించడానికి ఒక్క వ్యక్తీ లభించలేదు. యువరాజుకు ఆశ్చర్యమేసింది. స్నేహితుల జాబితాను ఎన్ని తడవలు వడపోత పోసినా అనుమానితులు ఒక్కరూ లభ్యంకాలేదు.

"మిస్టర్ జనమేజయం! మీరు సినిమానుండి వచ్చిన తరువాత ఎక్కడ విడివడ్డారో, ఆ స్పాట్ని చూపగలరా?" అడిగాడు యువరాజ్.

"భేషుగ్గా!"

బయలుదేరారు అందరూ.

8

"నేను ప్రసాద్ సినిమా విడిచిపెట్టగానే ఇంతవరకు మాట్లాడుకుంటూ వచ్చాం! ఇక్కడనుండి మా ఇల్లు దగ్గరే! ప్రసాద్ ఇక్కడనుండి తూర్పుగా ఆ రోడ్డు మీదను వెళ్ళాడు, దగ్గర్లో వున్న టాక్సీ స్టాండుకు! ఆటోనైనా, రిక్షానైనా మాట్లాడుకుని ఇంటికెళ్లుతానని చెప్పాడు" అన్నాడు జనమేజయం.

జనమేజయం చూపిన ప్రదేశంలో నిలబడి యువరాజ్ చుట్టుప్రక్కలగల పరిసరాలను పరిశీలించాడు.

అంతా ఇసుక ప్రదేశం, బీచ్ కావడం మూలంగా! ఇసుక ప్రదేశంలో దూరదూరంగా పరువానికి వచ్చిన పడతుల్లా అందమైన బిల్డింగులు అవుపిస్తున్నాయి.

బాగా బలిసిన శ్రీమంతులు సముద్రపు టొడ్డున, ఇసుకలో వ్యయప్రయాసలకోర్చి కట్టుకొన్న విశ్రాంతి భవనాలవి!! చూడచక్కగా వున్నాయి, ప్రతి ఇల్లూ.

సముద్రపుగాలికి ప్రతి ఇల్లు వికసించిన పుష్పంలా సౌరభాన్ని వెదజల్లుతూంది. ఇసుకలో సరైన రోడ్డుండదు. విసరి వేయబడ్డ రకరకాల పువ్వుల్లాగున్నై—ఆ ఇళ్ళన్నీ.

"ఇక్కడనుండి ఇటువైపుగా ప్రసాద్ వెళ్ళాడా?" అని జనమేజయాన్ని అడిగాడు యువరాజ్.

"అవునండి" అంటూ దారితీశాడు జనమేజయం.

యువరాజ్ లో రకరకాల ఆలోచనలు మెదులుతున్నాయి. ప్రసాద్ ని హత్యచేయగల వ్యక్తిగత ద్వేషం ఎవరికీ వున్నట్టనిపించలేదు. తను విచారించిన విషయాలలో ప్రసాద్ శవం తరుణేశ్వర్ ఇంట్లో పెట్టడానికి గల కారణం ఏమిటో ఊహకందడంలేదు.

ప్రసాద్‌ని బయట చంపి ఇంట్లో పెట్టి ఉన్నారు గనక, హత్యాప్రదేశాన్ని కనుగొంటే ఏవైనా ఆధారాలు లభిస్తాయేమోనని యువరాజ్ వూహ.

ఇసుకను చూస్తూ వెళ్లారు. ఒకచోట మరకలు కనబడ్లేదు గానీ, ఇసుకను చెరిపినట్టు కనబడింది. చెరిపిన ఇసుక రేణువులకు నెత్తురు అంటివున్న విషయం తెల్సుకోడానికి ఎంతోసేపు పట్టలేదు యువరాజ్‌కి.

రోడ్డు చేరడానికి ఇంకా పది గజా లున్నాయి. చేరకముందే అక్కడ ప్రసాద్ హత్య గావించబడ్డాడని అనుకున్నాడు యువరాజ్.

జనమేజయం, సూరి ఆశ్చర్యపోయి ఆ ఇసుకను చూశారు. స్పష్టంగా కనబడుతోంది, రక్తపు మరకల్ని చెరిపినట్టు.

"ఇక్కడే హత్య జరిగింది సార్!" అన్నాడు సూరి.

"అవును" అంటూ యువరాజ్ ఆ ప్రదేశాన్ని పరిశీలించాడు.

యువరాజ్ కాసేపు ఆలోచించుకున్నాడు. ఒక నిర్ణయానికి వచ్చాడు. హత్యాప్రదేశంలో నిలబడి నాల్గువెపులకు దృష్టిని సారించాడు. తన దృష్టికి వచ్చిన కొన్ని బంగళాలను సెలెక్ట్ చేశాడు.

ఆ ప్రదేశాన్ని ఏ ఏ బంగళాలనుండి చూడ్డానికి అవకాశం వుందో ఆ బంగళాలన్నిటి గుర్తులూ చెప్పాడు సూరికి.

కుడివైపు ఇళ్ళకు సూరిని పంపాడు, వాకబు చేయమని. ఎడమవైపుకు యువరాజ్ బయలుదేరాడు. బయలుదేరుతూ నెత్తురు అయివున్న ఇసుకను కొంత అందుకుని, జనమేజయానికి అందిస్తూ, "ఈ ఇసుకను క్రైంబ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ ధనార్జనరావుకు అందించు. ఈ రక్తం ప్రసాద్ రక్తానికి సరిపోతుందేమో చూడమను" అని చెప్పి పంపాడు.

9

రాత్రి ఎనిమిది అయింది, ప్రొద్దున్న పదకొండు గంటలు ప్రాంతంలో ప్రారంభించిన భోగట్టా సేకరణ ముగియడానికి.

యువరాజ్ సూరీలు కల్సుకుని ఒకరు సేకరించిన విషయాలను మరొకరికి చెప్పుకున్నారు.

విశ్రాంతి గైకొను వ్యక్తుల్లో రకరకాలవారు తారసపడ్డారు. కానీ ప్రసాద్ హత్యకు సంబంధించినవారు ఒక్కరూ తారసపడ్లేదు. హత్య జరిగింది చీకటిలో. ఎవరూ చూడ్లేదు. ఎవరూ ఆవైపుకు రాలేదు. ప్రసాద్ అనే వ్యక్తిని గురించి ఎవరికీ తెలియదు, లేశమైనా!

"సార్! మీరు నాకు చూపిన ఇళ్ళన్నిటినీ చూశాను, ఒక్క ఇల్లు తప్ప!" అన్నాడు సూరి.

"ఏం?"

"ఆ ఇల్లు తాళం పెట్టివుంది."

"ఇల్లెవరిది?"

"ఎవరిదైనది ఎవరికీ తెలియదు" చెప్పాడు సూరి.

"ఈ ప్రాంతపు ఇళ్ళల్లో అన్నిటిలో స్వంతదారులే వుండడంలేదు. అద్దెకు వుంటున్నవారూ వున్నారు,కొందరు" చెప్పాడు యువరాజ్.

"నేను చూచిన ఇంటిని ఎవరికీ అద్దెకు ఇవ్వడంలేదు. ఎవరూ వుండటం లేదట, చాలాకాలంనుంచి."

"ఎందుకు?"

"ఏమో?"

"కాపురం లేని ఇంటికి, మన యీ కేసుకి సంబంధం వుంటుందా?"

"ఇక్కడ వుండే ఇళ్ళల్లో అందరూ అగర్భశ్రీమంతులూ

సముద్రపుగాలికి, సముద్ర దృశ్యాల్ని చూడడానికి మోజు పడి ఇళ్ళు కట్టించుకున్నారు. వాళ్ళు లేని సమయాలలో కొందరికి అద్దెకిస్తున్నారు, ప్రతి ఇంటిని!! కానీ నేను చూచిన ఆ ఒక్క ఇంటిని ఇవ్వడంలేదు అద్దెకు."

"ఏ ఇల్లు?"

చూపుడు వేలితో చూపాడు సూరి, ఎత్తైన ప్రదేశంలో వున్న ఇంటిని.

సముద్రపుటలలు ఘోషించడం ఎక్కువైంది. గాలి దురుసుగా వస్తూంది. బంగళా లన్నిటినుండి రంగురంగు దీపాలు తమ రమ్యతను చాటుతున్నాయి. నక్షత్రాలు మెరిసే ఆకాశం, చీకటిని పులుముకున్న సముద్రం, అంధ కారం ఆక్రమించుకున్న ప్రకృతి, చీకటిలోనూ తమకున్న గుడ్డికాంతితో తాము ఉన్నట్టు చాటుకునే ఇసుక తిన్నెలు ఏవో అనుభూతిని, మనసుకి ఆహ్లాదతను కల్గిస్తున్నాయి.

సూరి చూపిన ఇల్లు చీకటిలోనూ, దీపాల కాంతులమధ్య కొట్టవచ్చినట్టు కనబడింది, ఆ ఇంటికి దీపం లేనప్పటికీ.

డిటెక్టివ్ లిదరూ ఆ ఇంటిని అలా చూచే సమయంలో ఒక ఆకారం నడిచివెళ్ళడం కనబడింది. ఇద్దరూ ఆశ్చర్య పోయారు, అంతవరకు జనసంచారం లేనిచోట ఒక వ్యక్తి నడిచివెళ్ళడం చూడగానే!

చీకటిలో నడుస్తున్నప్పటికి ఇళ్ళల్లో వెలిగే దీపాలు ప్రసరించు మసకకాంతిలో— ఆ నడిచేది ఒక యువతని ఇట్టే తెల్సిపోయింది. ఆమె వెళ్ళడం దీపంలేని ఇంటివై పుకి అని తెలియగానే డిటెక్టివ్ లిద్దరూ గబగబ నడిచారు ఆతృతగా.

తాము కనబడకుండా చీకటి ప్రదేశంలో నక్కారు యువరాజ్ సూరీలు!

వెళ్ళిన యువతి సరాసరి ఆ ఇంటిముందు కెళ్ళింది. తలుపుల వద్ద ఆగింది, తాళం తీయడానికి కాబోలు! మరుక్షణం ఇంట్లో దీపం వెల్గడం కిటికీలగుండా కనబడింది. మళ్ళీ వెంటనే వెల్గిన దీపం ఆరిపోయింది!!

ఆ ఇల్లు యధాప్రకారం తిరిగి చీకటిలో పడింది.

ఇంట్లోపల కెళ్ళిన యువతి ఎటు వెళ్ళింది? మేడమీదికి వచ్చివుంటే, మీద లైట్ వెలగాలికదా? లైటు వెలగలేదు. ఆ యువతి చీకటి యింట్లో ఏం చేస్తూవుంది?

యువరాజ్ సూరీలు దిగ్భ్రమచెంది తిలకిస్తున్నారు.

కాసేపటికి లైట్ వెల్గింది, యింట్లో! వెలిగిన లైట్ ఆరిపోయింది మళ్ళీ!

ఇపుడు ఆ యువతి తలుపులముందు నిలబడివుంది. అంటే తాళం వేస్తూ వుందా? వస్తూంది, వెళ్ళిన దారినే.

"సూరీ, బి కేర్ ఫుల్..." అంటూ యువరాజ్ సూరికి కొన్ని సూచనలు ఇచ్చాడు.

"ఎస్సార్!"అంటూ బయలుదేరాడు, ఆ యువతి వెనకాలే నీడలా—సూరి!!

10

యువరాజ్ తచ్చాడుతూ, మెల్లగా వెళ్ళి ఆ ఇంటి ముందు నిలబడ్డాడు. ఏదో క్రూరమృగం నోటిముందు నిలబడటు ఫీల్ అయ్యాడు.

సముద్రపు ఘోష, చీకటి, ఒంటరితనం, నిశీధిలో విరబోసుకున్న దెయ్యంలా వున్న ఆ ఇంటిముందు నిలబడగా యువరాజ్ కు రోమాలు నిక్కపొడుచుకుంటున్నాయి.

తలుపులకు వేళ్ళాడు తాళం గుడ్లగూబలా కనబడింది!

ఆ ఇంట్లోకి ఒక యువతి నిర్భయంగా వెళ్ళిరాగా, తను

భయపడడం అసహజం అనుకుంటూ, తాళం తెరవడానికి ప్రారంభించాడు.

సులభంగానే తాళం తెఱుచుకునేసింది. మెల్లగా నెట్టాడు, తలుపుల్ని. అవి కిచకిచ మన్నాయి. వాటి ధ్వని సముద్రపు ఘోషలో కల్సిపోయాయి.

లోపల చీకటిగా వుంది. స్విచ్ ఎక్కడుంది? ఆలోచిస్తూ గోడలకు సారించాడు తన దృష్టిని యువరాజ్.

తెల్లటి గోడలో స్విచ్ బోర్డ్ కనబడింది స్పష్టంగా.

తెఱిచిన తలుపుల్ని మూసుకుని, మెల్లగా స్విచ్ బోర్డ్ వైపుకు నడిచాడు.

స్విచ్ బోర్డుకు రెండే రెండు స్విచ్ లున్నాయి. ఒక స్విచ్ ని నొక్కాడు. కళ్ళు ఝిగేలు మన్నాయి, లైటు కాంతిలో. విశాలంగా ఉన్న హాలు. హాలుమధ్య ఒకే ఒక్క టేబులు. టేబులు చుట్టూ కుర్చీలు. ఆ హాలంతా శుభ్రంగా ఉంది. ఓ మూలగా మేడమీదికి మెట్లున్నాయి.

ఆ యింట్లోకి వచ్చిన యువతి మేడపైకి వెళ్ళలేదు. వెళ్ళి వుంటే మేడలో దీపం వెలిగి వుండాలి. అయితే ఎటు వెళ్ళి ఉంటుంది? దీపాన్ని ఆర్పుకుని ఏం చేసి వుంటుంది!? ఆలోచనలలో పడ్డాడు యువరాజ్.

స్విచ్ బోర్డులో ఉన్న మరో స్విచ్ ని నొక్కాడు. ఎక్కడో కరకరమని ధ్వని వినరాసాగింది, నిముషంపాటు! యువరాజ్ బిత్తరపోయి ధ్వని వచ్చిన వైపు చూశాడు.

గుండెలు దడదడలాడిపోయాయి.

గోడలో ద్వారం లాటిది ఏర్పడింది. ద్వారం లోపల లైట్లు వెల్గుతున్నాయి ప్రకాశవంతంగా. లైట్ల కాంతిలో క్రిందికెళ్ళే మెట్లు కనబడ్డాయి. అప్పా డర్థమైంది, వచ్చిన యువతి లైటు ఆర్పి క్రిందికి వెళ్ళి ఉంటుందని!

లైటు వెలగని ఇంట్లో లైటు వెలిగితే ఎవరికైనా అనుమానం కలగవచ్చు. తటాలున లైటు తీసేశాడు, హాలులోది!

హాలుని చీకటి అలుముకున్నా - గోడలో ఏర్పడ్డ సొరంగంలో దీపాలు వెలుగుతున్నాయి. ఆ దీపాలు వెలగడానికి, ద్వారం ఏర్పడడానికి ఒకే స్విచ్ పని చేస్తుందనుకున్నాడు యువరాజ్.

గోడలో ఏర్పడ్డ సొరంగం ముందు నిలబడ్డాడు.

మెట్లు చాలా లోతువరకు దిగి ఉన్నాయి. అంటే భూగర్భంలో ఏమిటో వుంది. తప్పక తెలుసుకు తీరాలన్న కాంక్షతో ద్వారంగుండా అడుగుముందుకు వేశాడు, యువరాజ్ భయపడే మనసుని అదుపుకు తెచ్చుకుంటూ!

సుమారు ఏడడుగుల ఎత్తుంది, ఆ సొరంగం. మెట్లు అన్నీ సిమెంటుతో వున్నాయి. శ్రమ లేకుండా దిగవచ్చు.

జేబులోని పిస్తోలును తడుముకుంటూ యువరాజ్ దిగడం ప్రారంభించాడు, మెట్లగుండా, దీపాల కాంతిలో.

చివరి మెట్టునుండి అడుగు క్రింద పెట్టూ, అక్కడున్న పెద్ద గోడౌన్ని చూచి సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు. అంత పెద్ద గోడౌన్ని భూగర్భంలో నిర్మించాలంటే మాటలు కాదు. సినిమా హాలు కంటె పెద్దదిగా వుందా హాలు!!

స్తంభీభూతుడై ఆ హాలుని తిలకించాడు. గుండెలు ఢమఢమలాడిపోతున్నాయి. ఎవరూ లేరక్కడ. డైనింగ్ టేబుల్‌లా ఒక పెద్ద టేబుల్ వుంది. ఆ టేబుల్ చుట్టూ సుమారు పాతిక కుర్చీలున్నై. అక్కడక్కడ అలమారులున్నాయి.

మరెటువంటి వస్తువులూ లేవక్కడ, చెప్పుకోతగ్గవి.

అంత పెద్ద హాలుని భూగర్భంలో ఎందుకు నిర్మించారు? ఎవరు నిర్మించారు? ఆ గోడౌన్ మూలంగా ఉపయోగం ఏమిటి? ఆలోచిస్తూ యువరాజ్ చుట్టూ కలయజూచు సమ-

యంలో ప్రక్కనే స్విచ్ బోర్డ్ కనబడింది. ఒక స్విచ్‌ని నొక్కాడు.

వెంటనే సొరంగంలో వెలిగే దీపాలన్నీ ఆరిపోయాయి.

హాలులోని దీపాలూ ఆరిపోయాయి. భయంకరమైన చీకటి తాండవమాడింది. ఆ చీకటిని చీల్చుతున్నాన్నట్టు కరకర చప్పుడు వినబడింది. చప్పుడ్ని బట్టి - గోడలో ద్వారం మూసుకుంటోందని తెలపోశాడు యువరాజ్.

మరో స్విచ్‌ని నొక్కాడు. హాలులో లైట్లు వెల్గాయి.

యువరాజు చెవులకు సముద్రపు ఘోష వింతగా వినబడు తోంది, ఎక్కడో నీళ్ళ చప్పుడుకూడా!

ఇంకా ముందుకెళ్ళి హాలుని చూశాడు. హాలుకు ఒకవైపు మెట్లున్నాయి పొడుగ్గా. ఆ మెట్లు క్రిందకు దిగుతున్నాయి. క్రిందకుదిగే మెట్లవద్దకు రాగానే, మెట్లను తన్నుకుని ఉండే నీరు కనబడింది!

యువరాజ్ ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది.

మెట్లను అనుకుని ఉన్న నీరు ఏదో సొరంగంలో వున్నట్టనిపించింది. అవును, సొరంగమే అది!

నీళ్ళల్లోకి మెట్లు ఎందుకున్నాయి? నీటిగుండా మార్గం ఎటైనా ఉంది? నీటిలో పడి సొరంగంగూడా వెళ్ళితే దారి ఎక్కడికెళ్తుంది? తీవ్రంగా ఆలోచిస్తున్నాడు యువరాజ్.

ఈ భూగర్భంలోకి వచ్చిన యువతి ఏం చేసింది? ఎందు కొచ్చింది? ఆలోచిస్తూ యువరాజ్ వెదకడం ప్రారంభించాడు.

అక్కడున్న టేబుల్ పైన ఒక కాగితం ఉండడం చూశాడు. గబగబ అటు వెళ్ళబోయాడు. అంతే!—

గుండెల్ని అదరగొట్టే ధ్వని. పిరికివాళ్ళను చంపేసే

ధ్వని హోరెత్తిపోవడం ప్రారంభించింది. ఆ ధ్వనితో హాలంతా దద్దరిల్లిపోతోంది. బొ౦య్ మంటూ భూగర్భాన్ని కదిల్చివేస్తోంది.

అంతటి యువరాజ్ ముందుకు అడుగువేయలేకపోయాడు. స్థిరంగా నిలబడ్డలేక, గుండెల్ని నిబ్బరించుకోలేకపోయాడు.

విచిత్రంగా నిర్మితమైన భూగర్భం! భూగర్భం గుండా సొరంగం! సొరంగం నిండా నీరు.

వినబడే ధ్వనికి ప్రతిధ్వని కలవగా యువరాజ్ తారెత్తిపోయాడు. వినబడే ధ్వని ఏదో మీద పడేటట్టుగానే వుంది. ఏంచేయాలో పాలుపోలేదు. ఎటువెళ్ళాలో తెలియడంలేదు.

టేబుల్ పైన ఉన్న కాగితం అందుకోవడానికి ముందుకు అడుగువేయలేకపోయాడు. బొ౦య్‌మనే ధ్వని మిక్కుటంగా!

గబగబ స్విచ్ బోర్డువైపు పరుగెత్తాడు యువరాజ్.

స్విచ్‌ని తీసేశాడు. గాంధాంధకారం అలుముకుంది. నీటివైపు పరుగెత్తాడు. నీటిలోకి ఉన్న మెట్లగుండా దిగేశాడు_ నీటిలో సొరంగంలోకి.

ధ్వని దగ్గరవుతోంది, హోరెత్తుతూ.

యువరాజ్ గుప్పెటలో ప్రాణం పెట్టుకుని, గొంతుకు ఆనే నీటిలో కూర్చుని చూస్తున్నాడు, ఆ శబ్దం వచ్చే వైపు.

11

సూరి ఆ యువతిని అనుసరించ సాగాడు. ఆమె ముఖాన్ని చూడ్డానికి అవకాశం లభించడం లేదు. కానీ, ఆమె వెళ్తున్నప్పుడు కొన్ని చోట్ల ఇళ్ళనుండి పడే వెల్తురులో ఆ యువతి వెనుక భాగాన్ని చూడగలిగాడు.

మోడరేట్ హేర్ డ్రస్! ముప్పాతిక వంతు వీపు భాగాన్ని కనిపింపజేసే జాకెట్. నవనాగరికతను చాటే పిరుదుల మీదకు జారిపోయిన చీరకట్టు! నడకలో వయ్యారం. హై హీల్స్ షూస్. ఎడమ చేతికి వాచ్. గుండ్రటి చేతులు. మొత్తానికి అందగత్తెలాగానే ఉండొచ్చనుకున్నాడు సూరి.

చాలా జాగ్రత్తగా ఫాలో అవుతున్నాడు, సూరి ఆలోచిస్తూ.

బీచ్‌కు దూరంగా ఆగి వున్న కారు వైపుకు ఆమె నడవడం చూడగానే సూరికి అయోమయం అయిపోయింది. తన కారు జనమేజయం ఇంటివద్ద వుంది. తన కారువద్ద కెళ్ళి, వచ్చేలోపు ఆమె వెళ్ళిపోవచ్చు. ఏం చేయాలి? సూరి మనసు పరిపరివిధాల పోతూంది.

ఆమె కారు వద్దకు చేరుకుంది.

దరిదాపుల్లో టాక్సీ కనబడ్లేదు. అక్కడ ఆ సమయంలో టాక్సీలుండవు, జనసంచారంలేని కారణంగా.

సూరి చేసేదిలేక పరుగెత్తాడు తన కారు వద్దకు.

ఆమె కారుని పదేపదే మననం చేసుకున్నాడు.

రొప్పుతూ తన కారుని చేరుకుని, బయులుదేరాడు సూరి వేగంగా.

ఆమె కారు ఏవైపుకు మళ్ళిఉంటుందో ఊహించుకుంటూ ఆ వీధి ఎగుదలకు తన కారుని పోనిచ్చాడు సూరి. కారుని స్లో చేశాడు. రియర్‌వ్యూ అద్దంలో చూశాడు. చుక్కల్లా రెండు దీపాలు కనబడ్డాయి. గిరుక్కున తల తిప్పిచూశాడు.

ఆ యువతి కారు వస్తోంది. సూరి కారు దాటుకుని వెళ్ళిపోతోంది, స్పీడుగా_అప్పటికే!

సూరి ఏక్సిలేటర్ని అదిమాడు. ఆ యువతి కారుని తన

దృష్టినుండి తప్పనివ్వలేదు. ఆమె కారు కొన్నిచోట్ల ఆగింది. ఆగినపుడల్లా ఆ యువతి కారు నుండి దిగి ఆయా ఇళ్ళల్లో కెళ్ళి మూడు నిముషాల తరవాత వచ్చి బయలుదేరుతూంది!

చివరకు ఆమె కారు లేడిస్ క్లబ్ ఆవరణలోకి వెళ్ళి ఆగింది. ఆవరణలో రకరకాల కారులు ఆగివున్నాయి.

సూరి తటపటాయించాడు, తన కారుని ఆ ఆవరణలోకి తీసుకెళ్ళడానికి. ఎందుకంటే అది ఆడవాళ్ళ క్లబ్! మగ వాళ్ళకు ప్రవేశం వుందో, లేదో?

ఆలోచించుకుంటూ కారునుండి దిగాడు సూరి.

మెల్లగా క్లబ్ ముఖద్వారం వద్ద కెళ్ళి లోనికి చూశాడు. ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది.

ఒక్కొక్క టేబుల్ చుట్టూ నల్గురైదుగురుగా యువతీ మణులు కుర్చీలలో కూర్చుని వున్నారు.

ప్రతి ఒక్కరి చేతుల్ని పేకముక్కలు అలంకరించుకుని వున్నై. కొందటి స్త్రీల వ్రేళ్ళ మధ్య సిగరెట్లు కాలుతున్నాయి, పొగను వదుల్తూ. కొన్ని బల్లల మీద ఖాళీ సీసాలు, ఖాళీ గ్లాసులు వుండగా మరికొన్ని బల్లల మీద నింపిన గ్లాసులు, నిండుగా వున్న బ్రాందీ బాటిల్స్ దర్శనమిస్తున్నాయి.

అక్కడున్న స్త్రీలను పరీక్షగా చూశాడు సూరి. ప్రతి ఒక్కరూ తమ అంతస్థుని, హోదాని, స్టేటస్‌ని, చూపడానికి ఎంతో శ్రమపడి అలంకరించుకుని వున్నారు, ఆభరణాలతో-సౌందర్యపోషక పదార్థాలతో.సువాసనలు,బ్రాందీ వాసనలు, సిగరెట్ పొగ వాసనలు అన్నీ మిళితం కాగా క్లబ్ లోపలినుండి వింతవాసన ముక్కుపుటాలను తాకుతూంది.

అక్కడున్న స్త్రీలను తిలకిస్తూంటే వారివారి భర్తలు ఎంతటి హోదాపరులోయిట్టే ద్యోతకమవుతోంది. ప్రతి స్త్రీ

తమతమ హంగులను, ఆర్భాటాలను, ఆడంబరాలను చూప డానికి ఎక్కువ శ్రద్ధ తీసుకని ఉంది. రథులు, అతి రథులు, మహారథులు కనబడుతున్నారు ప్రత్యక్షంగా, తమని తాము అతిగొప్పగా చూపుకోడానికి!

ఎవరు వాళ్ళంతా? ఈ కాలంలో చాలామంది కలిగిన కాంతలు తాగుడు, జూదం, సిగరెట్లకు అలవాటు పడి వున్నారని సూరికి తెల్సు. తను అనుసరించిన యువతి ఎక్కడ? ఏ వైపు కూర్చుని ఉంటుంది? ఆమెతో మాట్లాడ్డం ఎలా? ఆలోచిస్తూ నిలబడ్డ సూరిని క్లబ్లోని కొందరు స్త్రీలు ఎగాదిగా చూశారు, రకరకాల ఫోజులతో, ముఖకవళికలతో.

ఇంతలో, "ఎవరు కావాలి?" అంటూ ఇద్దరు యువతులు వచ్చి సూరికి చెరొక వైపూ నిలబడ్డారు.

"నాకు ఆవిడ కావాలి!" అంటూ సూరి తన కుడిచేతిని ముందుకు చాపి చూపుడు వేలితో చూపాడు.

తనని తదేకంగా చూడడం గమనించిన ఆ యువతి చివాలున లేచి వచ్చింది, సూరి వద్దకు.

"మీరు, మీరూ..." అన్నాడు సూరి తడబడుతూ, పెదాలను తడి చేసుకుంటూ.

"నా పేరు వింజామర! మీ రెవరు?"

"మీతో కొద్దిగా పనుంది. కాస్త బయటికి వస్తారా?"

వింజామర సూరి వెనుకాలే క్లబ్ బయటికి వచ్చింది, క్వశ్చన్ మార్కు ముఖంతో.

వింజామరను చూస్తూ, సూరి ఏదో చెప్పబోయాడు.

అదే సమయానికి అదిరిపోయాడు, భుజాల మీద పడ్డ ఇనుపగుండ్ల లాటి తాకిడికి. సూరి తలను అటు ఇటు తిప్పి చూశాడు ఎవరా అని!

ఇద్దరు వస్తాదుల్లాటి వ్యక్తులు కండలు తిరిగిన శరీరాలతో దర్శనమిచ్చారు. అడవి మృగాల్లాగున్నారు. "ఎవరు మీరు?" ఆశ్చర్యపోతూ అడిగాడు సూరి, తనకు ఇరువైపులా నిలబడ్డ వ్యక్తుల్ని చూచి.

"నువ్వు, వింజామరను అనుసరిస్తూ వచ్చిన వాడివని తెలుస్తున్న వింజామర బాడీగార్డ్సమ్!" చెప్పాడొకడు.

"బాడీగార్డ్సా?!!" విచిత్రపోయాడు సూరి.

"అవును. నీ వెందుకు బీచ్ వద్దనుండి వింజామరను వెంటాడుతూ వచ్చావు? ఎవరు నువ్వు?" అడిగాడు ఇంకొకడు.

సూరి ఆలోచనలో పడ్డాడు. నిజం చెప్పడమా? అబద్దం చెప్పడమా? వీరి మూలంగా తనకేమైనా హంతకుడ్ని గురించిన వివరాలు తెలుస్తాయా?

12

భూగర్భంలో గల సొరంగంలో ఉండే నీటిలో యువరాజ్, చిట్టచీకటిలో తలవరకు మునిగి దాగివున్నాడు.

చలిగా ఉంది. చలికంటె భీకరంగా సైరన్ మోతలాటి మోత హోరెత్తిపోతోంది. గుండెల వేగం క్షణక్షణానికి పెరిగిపోతోంది భయంతో.

హఠాత్తుగా మోత ఆగిపోయింది. ఆ మోత ఆగుతున్నప్పుడు, చెవులు రిక్కించాడు యువరాజ్, ఏ వైపునుండి వస్తూందో, మోతకుగల కారణం ఏమిటో తెల్సుకోడానికి!

ఆ మోత సొరంగంలో గల నీటి పైభాగాన్నుండి వస్తూందని గ్రహించాడు. ఎందుకు ఆగిపోయింది? గుడ్లప్పగించి చీకటిలోకి సొరంగంవైపు చూస్తున్నాడు యువరాజ్.

సొరంగంలో గల నీటి పైభాగాన్నుండి గలగల చప్పుడు వినరాసాగింది. యువరాజ్ గుండెలు ధమధమలాడిపోతు

న్నాయి. సారంగంలో గల నీటినుండి వచ్చే శబ్దం ఏమిటి? ఎందుకు?

గలగల చప్పుడు దగ్గరవుతోంది. వెంటనే నీటిలో కాంతులు లేస్తున్నాయి.

చిట్ట చీకటిలో, లేచే కాంతులలో సారంగం స్పష్టంగా కనబడసాగింది. యువరాజ్ కు గుర్పాటు కల్గుతోంది. ఒళ్ళంతా జలదరించిపోతోంది.

మనసుని అదుపుకు తెచ్చుకుని ఆలోచించుకోగా, మోత మోటర్ బోట్ చేసేదని బోధపడింది.

అంటే, మోటార్ బోటు సారంగంలోగల నీటి పైభాగా న్నుండి వస్తుందన్నమాట, గొడౌన్ కి! ఎక్కడనుండి? సము ద్రంలో నుండా? ఆశ్చెరువు చెందిపోయాడు యువరాజ్.

సారంగం మానవులచే నిర్మిత మైనదిగా కనిపించలేదు. సహజ సిధ్ధంగా ఏర్పడి వుండాలి.

కొంత సేపటికి ఇంజన్ ఆగిన బోటు చుక్కాని సాయంతో రావడం కంటబడింది. చుక్కాని ఎందుకు ఉప యోగిస్తున్నారు?

సారంగంలో మలుపులు వుండొచ్చు.మలుపుల్లో బోటుని మళ్ళించ అలవిగాక చుక్కాని సాయంతో నడుపుతున్నారు కాబోలు.

యువరాజ్ మెట్లమీద ఉన్నాడు మునిగి! బోటువస్తే తను తప్పక కనబడతాడు, లైట్ల కాంతిలో! యువరాజ్ గబగబ మెట్లనుండి జారుకుని ఈదుకుంటూ వెళ్ళి సారంగం గోడకు ఓ మూల ఆనుకుని చాటుగా నిలబడ్డాడు నీటిలో.

ఒక మోటారుబోటు సారంగంగుండా వచ్చి చేరింది, మెట్లకు దగ్గరగా. అందులో ఎందరున్నారో తెలియలేదు.

బోటులో వున్న వ్యక్తులు వుపయోగించే టార్చిలైట్ కాంతి తనమీద పడే పక్షంలో మునిగిపోడానికి యువరాజ్ తయారుగా వున్నాడు.

యువరాజ్ భయంతో వణికిపోతున్నాడు. ఆ బోటులో వుండే వ్యక్తులు అతిదుర్మార్గులై వుంటారు. తనని పసిగట్టిన మరుక్షణం నిర్దాక్షిణ్యంగా చంపేస్తారు, తమ రహస్య స్థావరం తెల్సిపోకూడదని.

ప్రసాద్ హంతకుని అన్వేషణలో అటువంటి పరిస్థితులు, సంఘటనలు ఎదురౌతాయని యువరాజ్ వూహించనైనా లేదు. కానీ కల్గిన క్లిష్టపరిస్థితుల నుండి బయటపడడానికి నేర్పు వహించాలి. వాళ్ళ గూడుపుఠాణీని మట్టుపెట్టాలి!

బోటునుండి బిలబిలమంటూ కొందరు వ్యక్తులు దిగడం, టార్చ్ వెలుగులో స్విచ్‌బోర్డు వర కెళ్ళడం, గొడౌన్‌లో లైట్లు వెల్గడం జరిగింది!

బోటునుండి దిగిన వ్యక్తుల్ని పరికించి చూశాడు యువరాజ్.

దేశీయులు, విదేశీయులు ఉన్నారు వారిలో. అందరూ బలిష్ఠులు, యువకులు. ప్రతి ఒక్కరిలోనూ ఒక విధమైన కరడుతనం కనబడుతోంది. చెంపలకు చేరదేసి జులపాలు. కొందరికి భుజాలను తాకుతూండే తలనీలాలు! బెల్‌బాటమ్ పాంట్లు గోతాం సంచుల్లాగున్నై. రంగురంగుల చొక్కాలు కాళ్ళకు బూడ్సులు, చేతులకు వాచీలు.

బోటులో నుండి ఏవేవో పార్సళ్ళు దింపుతున్నారు కొందరు.

కాసేపటికి మరోబోటు చేరుకుంది ఆ చోటుకి. అందులోనూ వ్యక్తులున్నారు. ఏవో పార్శళ్ళున్నాయి. పార్శ

శ్శను దింపి గొడౌన్‌లో ఓ మూలగా పేర్చారు, అందరూ కల్సి.

టేబుల్ మీదుండిన కాగితాన్ని ఎవరో అందుకుని చూశారు.

అంతే, అతను అరిచాడు పెద్దగా! ప్రతిధ్వని మూలంగా అతను అరిచిం దేమిటో అర్థంకాలేదు యువరాజ్‌కి.

అతి శ్రమపడి లెక్కించాడు యువరాజ్, వారెంద రున్నారో తెల్సుకోడానికి. ఇరవైముగ్గు రున్నారు.

అంతమందిలో ముగ్గురు మగువలు పరువంలో ఉండి ఆకర్షితముగా ఉండడం ఓ ప్రత్యేకత!

ఒక్కొక్కరుగా ఆసీనులవుతున్నారు కుర్చీలలో. ఇద్దరు యువతులు అలమారులను తెరిచి, అందులో ఉన్న సరికొత్త విదేశీమధుపానీయా లున్న బాటిల్స్‌ను తీసి టేబుల్ మీద పెట్టున్నారు.

మరో యువతి రికార్డు ప్లేయర్ని అరేంజ్ చేసింది.

ఒక రికార్డును పెట్టి ఆన్ చేసింది. ఆ మ్యూజిక్‌ని ఎవరు కండక్ట్ చేశారో గానీ బ్రహ్మాండగా వుంది. గొడౌన్ ప్రతిధ్వనించడం మూలంగా రికార్డు ప్లేయర్నుంచి వచ్చే సంగీతం ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని రేపుతూంది.

మ్యూజిక్‌తో గొడౌన్ అంతా మారుమ్రోగిపోతోంది.

ఆ మ్యూజిక్ వింటూంటే నీటిలో వున్న యువరాజు మైమరచి పోయాడు, ఆహ్లాదంతో. ఆ సంగీతానికి తోడు ఆ యువతులు ముగ్గురు డాన్స్ చేయడం ప్రారంభించారు.

ఏదో సినిమా షూటింగ్ జరుగు ప్రదేశంలాగుంది.

ముగ్గురు యువతులు పోటీలుపడి, మ్యూజిక్‌కి అనువుగా ఆడుతున్నారు.

ఆడుతూ అందరికీ కైపు ఎక్కిస్తున్నారు. ఉత్తేజపరుస్తున్నారు రెచ్చగొట్టుతున్నారు.

అందరూ తప్ప తాగేశారు యువతుల ప్రోత్సాహంతో.

తాగిన మైకంలో ఒక్కొక్కరూ ఏదో ఆవేశంగా ఒక్కో యువతిని వాటేసుకుని చప్పగా జారిపోయారు నేల మీదకు, శవాల్లా!

అందరూ హద్దు మీరి తాగడానికి కారణం మ్యూజిక్, మ్యూజిక్ కి తగిననాట్యం, నాట్యంలో గల సెక్స్ అప్పీల్. తాగినతరువాత అంతా పడిపోవడానికి కారణంవాళ్ళు పుచ్చుకున్న మధువు పసందైనది, ఘాటైనది, ఒరిజినల్ సరుకు. అది ఇచ్చిన నిషా ముందు, నిలదొక్కుకో లేకపోయారు ఎవరూ.

అంత మంది నిషాకు బానిసలై పడిపోగానే ఆ యువతులూ ఆడిన అలసటకు వేసుకున్నారు 'మందు.'

యువరాజ్ నవ్వుకున్నాడు, నీటిలో!

మెల్లగా మెట్ల దగ్గరకు ఈదాడు. లేచి నిలబడ్డాడు. తడిసిన బట్టల్ని విప్పుకున్నాడు. బనీయన్ని తీసేశాడు. అన్ డర్ వేర్ తోనే బోటులోకి వెళ్ళాడు. బోటులో వెదగ్గా ఎవరివో పాడిబట్టలు కనబడినయ్.

తొడుక్కుని, తను విప్పిన గుడ్డల్లోగల అవసరమైన వస్తువుల్ని తడి లేకుండా తుడుచుకుని జేబులో పెట్టుకున్నాడు. స్విచ్ బోర్డ్ వైపు నడిచాడు.

లైట్లు ఆర్పేశాడు, జీరో ఓల్ట్సు బల్బుని తప్ప.

ఆ ప్రదేశానికి ఇతరులెవరూ రారన్న నమ్మకం అందరికీ వుంటుంది. గనక తను అటు ఇటు తిరగడం గమనించినా పట్టించుకోరని యువరాజ్ నమ్మకం.

గబగబ పార్కిళ్ళ పేర్చిన వైపుకు అడుగులు వేశాడు,

పార్శిళ్ళల్లో ఏముందో చూడ్డానికి.

పార్శిళ్ళ వైపు పోయేటపుడు, మధ్యలో తెరిచిన అల మారు ఆటకాయించింది.

అప్రయత్నంగా అలమారులోకి దృష్టిని పోనిచ్చాడు. గుండెలు గుభేలు మన్నంత పనైంది, అందులో ఉన్న కత్తిని, కత్తిపన్న నెత్తురు మరకల్ని చూడగానే!

అంటే వీళ్ళల్లోనే ఎవరో ప్రసాద్ ని హత్యచేసివున్నారా? ఆలోచనలో పడిపోయాడు.

ఈ ముఠాలోని వ్యక్తే ప్రసాద్ ని హత్యచేసి వుంటే ప్రసాద్ కీ యీ ముఠాతో సంబంధం వుందా? ఇంత మందిలో హంతకుడెవరు?

అక్కడున్న వారంతా నేరస్తులే, అవుతారు చట్టానికి! నేరస్తుల్లో గల హంతకుడ్ని తెల్సుకోవాలి. ఎలా? హంతకుడు ప్రసాద్ ని చంపి తరుణేశ్వర్ ఇంట్లో ఎందుకు పెట్టాడు? తరుణేశ్వర్ మీద ద్వేషమా? తరుణేశ్వర్ మీద ద్వేషమైతే... తరుణేశ్వర్ కీ ఈ ముఠాతో సంబంధం ఉన్నదన్నమాట! విచిత్రమైన కేస్. విడ్డూరమైన విషయ మనుకున్నాడు యువ రాజ్.

అంతమందిలో హంతకు డెవరైంది తెల్సుకునే దెలా?

వెంటనే బయలుదేరి పోలీసు బలగాన్ని పిలుచుకు రావడం మంచిదా? సూరి వెళ్ళినవాడు పోలీసులతో వస్తాడేమో?! తను వెళ్ళి పోలీసులతో వచ్చేలోపు ఈ గొడౌన్ లో విపరీతం సంభవిస్తే?

గనక ఇక్కడ నుండి వెళ్ళకనే హంతకుడ్ని బంధించి-ముఠా వ్యక్తుల్ని పట్టివ్వాలి. ఎలా?

మెరుపులా ఒక ఆలోచన తట్టింది. జేబులోకి చెయ్యి

పోనిచ్చాడు. తడిసిన డైరీ చేతికి అందింది. ప్లాస్టిక్ కవర్ వుండడం మూలంగా కాగితాల అంచులు మాత్రం తడిసి పోయి వున్నాయి. కాగితాలు తడవలేదు.

కలం అందుకుని ప్రతి పేపరు మీద "ప్రసాద్ - తరుణేశ్వర్" అని వ్రాశాడు.

అక్కడున్నవారు ఇరవై ముగ్గురు. ఇరవై మూడు కాగితాల మీద ప్రసాద్, తరుణేశ్వర్ అని వ్రాసి ప్రతి ఒక్కరి జేబులోను పెట్టేశాడు, యువరాజ్.

స్త్రీల దగ్గర వాళ్ళ జాకెట్లకు తురిమాడు.

తరుణేశ్వర్, ప్రసాద్ ల, పేర్లు వ్రాసి యువరాజ్ అందరి వద్ద ఎందుకు ఉంచాడంటే... మేల్కొగానే జేబులో వుండే కాగితంలో గల పేర్లు చూస్తే హంతకుని ముఖంలో రియాక్షన్ కనబడుతుందని! లేక హంతకుడు ఏదైన చర్య గైకొనవచ్చు!

ఇక, పోలీసుల్ని రప్పించి, కాపలా వుంచి - అక్కడున్నవారు మేల్కొని జేబులో కాగితాన్ని చూచేటపుడు హంతకుడిని సులభంగా పట్టుకోవాలని నిర్ణయించుకున్నాడు యువరాజ్.

పైకి వెళ్ళడానికి సారంగం వద్దగల స్విచ్ బోర్డు వద్ద కెళ్ళాడు, ఆన్ చేయడానికి. ద్వారం తెరుచుకోడానికి, లైటు వెల్గడానికి స్విచ్ ని నొక్కు తరుణంలో......?

కళ్ళు ఝిగేలుమంటూ లైట్లు వెలగడం, ద్వారం తెరచుకునే చప్పుడు వినబడడం జరిగింది. యువరాజ్ స్థాణువై నిలబడిపోయాడు, ఎవరో వస్తున్నారని గ్రహించగానే, శరీరమంతా గడగడలాడిపోయింది.

ఎవరో దిగిరావడం అడుగుల చప్పుడు స్పష్టంగా వినిపించింది.

ఒక్క ఉరుకులో పడివున్న ఒక యువతిని చేరుకుని, ఆ యువతిని కావలించుకుని పడుకునివున్న వానిలా పడుకునే కాడు యువరాజ్. అడుగుల చప్పుడు దగ్గరై పోతున్నాయి.

* * *

"నేను వెంటబడి రావడం అంతా చూశారా?" అడిగాడు సూరి.

"చూశాం!"

"ఇదో మిస్టర్, నేను అందగత్తెను. నా కెప్పుడూ ప్రమాదం అంటిపెట్టుకుని ఉంటుంది" చెప్పింది వింజామర.

"ప్రమాద మంటే!"

"నా అందాన్ని చూసి ఆవేశపూరితులైన కొందరు, బలాత్కారం చేయడానికి పూనుకున్న సంఘటనలు యిదివరలో జరిగివున్నాయి.అందుకే జీతమిచ్చి బాడీగార్డ్స్‌ని నియమించుకున్నాను.నీ వెందుకు యిలా నా వెంటబడ్డావు నా అందానికి దాసోహం కాకపోతే!!"

"నిజమే. ప్రతి మగాడూ మిమ్మల్ని చూస్తే మీ అందానికి గులాము కాక మానడు. నేనూ మీ వెంటబడ్డాను, మీ అందానికి బానిసనై! మరో విషయం బీచ్ లైన్‌లో ఒక హత్య జరిగింది. ఆ హత్యకు సంబంధించిన హంతకుని అన్వేషణలో మీరు తారసపడ్డారు. నేను ప్రయివేటు డిటెక్టివ్‌ని!" చెప్పాడు సూరి.

"హత్య జరిగిందా?ఎక్కడ?" బిత్తరపోయింది వింజామర.

"మీరు దీపంలేని ఇంట్లోకి వెళ్ళి వచ్చారు, చూశారా, ఆ ఇంటికి సమీపంలో!"

"నేను దీపం లేని ఇంట్లోకి వెళ్ళిరావడం చూశావా?" తత్తరపడిపోయింది. ఆమె తడబడడంలో ఆమె లిప్‌స్టిక్

పెదాలు కాబరే డాన్స్ చేశాయి.

"చూశాను" అన్నాడు సూరి ఆమెనే పరిశీలనగా చూస్తూ.

"ఎందుకు చూశావు?"

"చెప్పానుగా, హంతకుడి కోసం అక్కడున్న ఇళ్ళు అన్నిటిలోనూ విచారిస్తూ రాగా, మీరు కనబడ్డారు."

"నువ్వు ఒక్కడివేనా? నీతో ఇంకెవరైనా వచ్చారా?"

"యువరాజూ వచ్చారు."

"ఎవరూ యువరాజా...ప్రయివేట్ డిటెక్టివ్ కదూ?!"

"అవును."

వింజామర భయంకంపితురాలైంది.

వెంటనే తన బాడీగార్డ్సుని ఉద్దేశించి సైగ చేసింది. వాళ్ళిద్దరూ క్షణంలో సూరిని ఇరికించి పట్టేశారు, కదలనీయకుండా!

"ఏమిటిది?" అడిగాడు సూరి కోపంగా, విదిలించుకోటానికి ప్రయత్నిస్తూ.

"మా జీవితాలు సముద్రంలో పయనించు పడవలాటిది! ఆ పడవకు మీబోటివారి మూలంగా చిల్లులుపడే ప్రమాదముంది. చిల్లులు పడకముందే జాగ్రత్తపడుతున్నాను," అంటూ వింజామర కారువద్దకు నడిచింది, హడావిడిగా.

"కమాన్, క్విక్! సూరి చేతుల్ని వెనకకు విరిచి కట్టెయండి. డిటెక్టివ్ యువరాజ్ మన గొడౌన్ని పరిశోధించడానికి పూనుకుని వుండొచ్చు. యువరాజ్‌ని గురించి నాకు బాగా తెలుసు, ఆవలిస్తే పేగులు లెక్క కట్టుతాడు" అంటూ కార్లో కూర్చుని సెల్ఫ్ లాగింది.

సూరి అచేతనంగా ఉండిపోయాడు తన చేతుల్ని బంధించి కార్లోకి నెట్టుతూంటే.

14

"ఏమిటి అందరూ పడిపోయివున్నారు?" అన్నాడొకడు.

"చిత్తుగా తాగి వుంటారు, వెధవలు" అన్నాడింకో బాడీగార్డ్.

"యువరాజ్ ఇక్కడెక్కడైనా ఉన్నాడేమో వెదకండి!" వింజామర అక్కడున్న వారందర్నీ చూడసాగింది.

సూరి గుండెలు ఢమఢమలాడుతున్నాయి. యువరాజ్ వున్నాడా, లేడా? సూరికి చేతులు వెనుకకు విరిచి కట్టబడి వున్నాయి. ఆదుర్దాలో అటు ఇటు తిరుగుతున్నాడు, భూగర్భంలోని గొడౌన్‌లో.

మెట్లమీదున్న తడిసిన బట్టల్ని వింజామర పనిగట్టేసింది.

"యువరాజ్ తప్పక వీళ్ళలోనే వున్నాడు. ఈ గొడౌన్ రహస్యం ఇంకా బయటికి పొక్కలేదు. కనక యువరాజ్‌ని ప్రాణాలతో వదలకూడదు" అన్నది వింజామర.

సూరికి ముచ్చెమటలు పట్టేస్తున్నాయి. బూటుకాలిని టకటకలాడించాడు.

"ఏమిటి బూటుతో టకటకలాడిస్తున్నావ్?!" అన్నాడొక బాడీగార్డ్.

ఆ టకటకలో హెచ్చరికను మిళిత పరిచాడు సూరి. యువరాజ్ అక్కడున్న వ్యక్తులలో వుంటే తన హెచ్చరికను పాటిస్తాడని తెల్సు.

'సార్! జాగ్రత్త! అదనుచూచి విజృంభించండి. నా చేతులు బంధించబడివున్నా, నా రెండు కాళ్ళున్నాయి. తప్పక నా కాళ్ళను ఆయుధాలుగా మార్చుకోగలను' అని.

యువతి ప్రక్కనున్న యువరాజ్ వింజామరతో వచ్చిన వ్యక్తుల్ని ఓరకంటతో చూశాడు. దున్నల్లాగున్నారు.

వాళ్ళను దెబ్బతీయడం సామాన్య విషయం కాదనిపించింది.

నిషాలోపడి మత్తుగావున్న వ్యక్తుల్లో ఎవరైనా లేస్తారా? ఇప్పట్లో లేవరని నమ్మకం కుదిరింది.

బాడీగార్డ్సులో ఒకడు వెనుక్కుంటూ వస్తున్నాడు.

వింజామర చూస్తూ వస్తోంది.

సూరి ఆందోళిత మనస్సుతో నిలబడి వున్నాడు. అదే సమయంలో యువరాజ్ వుండి, తలబడితే కలియబడడానికి సంసిద్ధంగా వున్నాడు.

ఒకడు దగ్గరయే కొలది యువరాజ్ తన యావశ్శక్తినీ కూడగట్టుకున్నాడు.

అతను పొజిషన్‌కు రాగానే యువరాజ్ మెరుపులా లేచి ఖడ్గమృగంలా ఢీకొన్నాడు.

యువరాజ్ తాకిడికి తట్టుకోలేక భళ్ళున పడిపోయాడు ఒక బాడీగార్డు! అతను పడగానే ఆ గొడౌన్ యావత్తూ దద్దరిల్లపోయింది.

ఆ హఠాత్సంఘటనను చూడగానే ఇంకో బాడీగార్డ్ శరవేగంతో దూసుకొచ్చాడు, యువరాజ్ మీదికి.

వింజామర విభ్రాంతురాలై హాండ్‌బాగ్‌లో చెయ్యి పెట్టింది.

ఆమె చెయ్యి బయటికి వస్తే – ఏముంటుందో సూరి వూహించుకుని ఒక్క ఉరుకున ఆమెను చేరుకుని, తన కుడి కాలితో ఈడ్చి ఆమె డొక్కలో తన్నాడు, నిర్దాక్షిణ్యంగా.

మంచి దెబ్బ! అందులో బూడ్సుకాలి దెబ్బ!

కిక్‌మంటూ నేలకొరిగిపోయింది, వింజామర కప్పగా! ఆమె చేతిలోని పిస్తోలు వెక్కిరిస్తూంది!

చేతుల బంధాలు తెగవు. కానీ కాళ్ళతోటి యువరాజ్‌కు

సాయపడాలని బాడీగార్డ్స్ వైపు అంగలు వేశాడు సూరి.

సూరి సమయం చిక్కినపుడు తన కాళ్ళతో తన్నగలుగుతున్నాడు బాడీగార్డ్స్‌ని. యువరాజ్ వారితో ఎంత పోరాడినా లొంగే సూచనలు కానరాలేదు.

సూరి బంధాలను విప్పడానికి యువరాజ్‌కు ప్రాణాలు పోయినంతపనైంది.

ఇద్దరికిద్దరు, సమఉజ్జీలు. తమ బలాబలాలను ప్రదర్శించుకోడానికి మంచి అదను. ముష్టియుద్ధం భీకరంగా సాగింది.

డిటెక్టివ్‌లిద్దరూ కల్సి చివరకు బాడీగార్డ్స్‌ని లొంగదీసుకోగలిగారు, అతిప్రయాసమీదట.

"సూరీ. హరియప్! పోలీసుల్ని పిలువ్" అరిచాడు యువరాజ్, బాడీగార్డ్స్‌ని బంధిస్తూ.

* * *

ఒక్కొక్కరుగా నిషానుండి మేల్కొంటున్నారు. మేల్కొన్నవారు ప్రక్కనున్న వారిని లేపుతున్నారు.

లేచి నిలబడ్డ వారిని జేబులోవున్న కాగితం వెక్కిరిస్తోంది వింతగా. కొంతమంది ఆ కాగితాన్ని అందుకుని నలిపి కింద పారేశారు నిద్రమత్తులో, అర్థంగాక.

ఒకడుమాత్రం ఆ కాగితాన్ని చూడగానే తన నిద్రమత్తు నంతటినీ పారదోలి, బిత్తర చూపులతో అక్కడున్న వారందర్నీ చూడసాగాడు. అందరి జేబుల్లోనూ, ఆ కాగితాలు కనబడగానే అతను ఆవేశపూరితుడై ఆగ్రహాన్ని తెచ్చుకుని, "ఈ కాగితాలను వ్రాసిందెవరు?" అని గొంతెత్తి అరిచాడు.

"నేను వ్రాశాను" అంటూ, అంతవరకు పార్శిళ్ళ

వెనుక దాగి గమనిస్తూన్న యువరాజ్ ఎదురుగావచ్చి నిల బడ్డాడు.

"ఎవరు నువ్వు?" క్రోధంతో గర్జించాడు. అతని గర్జన గొడౌన్‌లో మారుమోగిపోయింది.

"నీ పాలిట యముడు" అంటూ, పార్శ్వశ్ళ వెనకపోలీసు బలగం బిలబిలమంటూ వచ్చి చుట్టేసింది అందరినీ.

15

"ఎవరు మీరంతా, నిజం చెప్పేయండి! భూగర్భంలో గొడౌన్‌ని కట్టిం దెవరు?" అడిగాడు యువరాజ్ వింజా మరని.

"మేమంతా స్మగ్లింగ్ గాంగ్‌కు చెందినవారం! కొన్ని సంవత్సరాల క్రితం స్మగ్లింగ్ ముఠాకు చెందిన వ్యక్తులు కొందరు విలువైన వస్తువులతో బోటు వస్తూందని కొందరు అధికారులు పసిగట్టి వెంబడించారు, పట్టుకోడానికి! కానీ గాంగ్ వ్యక్తులు తప్పించుకునే సందర్భంలో అప్రయత్నంగా తమ బోటుని సొరంగంలా కనబడు ప్రదేశంలోకి మళ్ళించారు కనబడకుండా వుండడానికి. నిజానికి ఆ సొరంగాన్ని ఎవరూ కనుగొనలేకపోయారు. అనుమానించనూ లేకపోయారు ఇంతకాలం వరకూ! అప్పటి గాంగ్ వ్యక్తుల్లోని కొందరు ప్లాను వేసుకుని అక్కడ గొడౌన్‌ని నిర్మించారు వ్యయ ప్రయాసలకోర్చి. అక్కడి ఆస్థావరం కొన్ని సంవత్సరాలుగా స్మగ్లింగ్ ముఠావ్యక్తులకు ఉపయోగపడుతోంది!" చెప్పింది వింజామర వివరంగా.

"మిస్టర్...నీవెందుకు ప్రసాద్‌ని హత్యచేశావు? హత్య చేసిన ప్రసాద్‌ని తరుణేశ్వర్ ఇంట్లో ఎందుకు పెట్టావు?

హత్య జరిగినట్టు పోలీసులకు ఎందుకు చెప్పావు, ఫోన్ చేసి?"
అడిగాడు యువరాజ్ నిజం చెప్పమన్నట్టు.

"భయపడి ప్రసాద్‌ని చంపాను" చెప్పాడు స్మగ్లింగ్‌కు సంబంధించిన వ్యక్తి.

"భయపడా?...భయమంటే ఏమిటో మీకు తెల్సా. ఏమిటా భయం?" ఆశ్చర్యపోయి అడిగాడు యువరాజ్.

"నేను గొడౌన్ నుండి కొన్ని ఆజ్ఞల అనుసరించి నా చేతికి ఇవ్వబడ్డ సూట్‌కేసుని అందుకుని బయలుదేరాను, అందివ్వవలసిన చోటుకి! ఇసుకలో నడుస్తూ సిగరెట్ కాల్చుకోబోవు సమయంలో సూట్‌కేసు తెరుచుకుంది, వాటి క్లిప్పులను సరిగా నొక్కని కారణంగా. సూట్‌కేసు తెరుచుకోగానే అందులో వుండిన గోల్డ్ బిస్కెట్స్, వాచెస్, టేప్ రికార్డర్లు, ఇంకా విలువగల వస్తువులన్నీ కిందపడిపోయినాయి ఇసుకలో.

నేను గబగబా వాటిని ఏరి సూట్‌కేసులో పెట్టే సమయంలో నా ప్రక్కగా ప్రసాద్ వచ్చి నిలబడ్డాడు గమనిస్తూ నిముషంపాటు. నన్ను, సూట్‌కేసులోని వస్తువుల్ని పదేపదే చూశాడతను. చూచిన ప్రసాద్ గబగబా నడవడం ప్రారంభించాడు.

"అతను పోలీసులకు చెప్పేస్తాడని భయపడ్డాను. నాలో ఏదో ఆవేశం కలిగింది. ఉద్రేకం ఉబికింది. నా జేబులో వుండిన కత్తిని అందుకుని వెళ్ళిపోయే ప్రసాద్ వెనకగా వెళ్ళి పొడిచేశాను, అరుస్తాడేమో నని గొంతును పట్టుకుని నులిపేశాను.

"ప్రసాద్ చచ్చిపోయాడని తెలియగానే నాలో వివేకం మేల్కొంది. శవం అక్కడే వుంటే పోలీసులు వస్తారు ఆ

చోటుకి. చుట్టుప్రక్కల విచారణ సమయంలో మా స్థావరపునికి తెల్సిపోతుందని జంకాను. అందుకని ప్రసాద్ జేబులు వెదికాను. అతని జేబులోగల పర్సులో అతని అడ్రసుని చూశాను. అడ్రసు చూడగానే ఒక ఆలోచన తట్టింది. శవాన్ని వాళ్ళ ఇంట్లోకి చేర్చితే—ప్రసాద్‌కు విరోధులుంటే నేరం ఆటుమళ్ళుతుందని భ్రమపడ్డాను.

"శవాన్ని ఎత్తుకుని ప్రసాద్ ఇల్లుచేరాను, కార్లో. ప్రసాద్ ఇంటి బయట తలుపుల్ని చూడగా లోపలగడియ పెట్టుకున్నారని తెల్సింది. శవాన్ని ఎక్కడ పెట్టాలన్న సంశయంతో వుండగా, ప్రక్కింటినుండి ఇద్దరు—దంపతులు అనుకుంటాను, చిరుబురులాడుకుంటూ బయటికివచ్చారు చేతిలో సంచితో—అర్థరాత్రిలో వాళ్లు వెళ్ళే సందడిలో తలుపుకు తాళం పెట్టలేదు. గొళ్ళెంమాత్రం పెట్టారు. నేను ప్రసాద్ శవాన్ని ఆ ఇంట్లోకి తీసుకెళ్ళి పడగ్గదిలోచక్కగా పడుకోబెట్టి—పోలీసులకు ఫోన్ చేసి చెప్పి వెళ్ళిపోయాను" చెప్పాడతను నిజాన్ని దాచకుండా.

"మిస్టర్ తరుణేశ్వర్, నువ్వు చేసిన నేరం ఏమిటి? నువ్వసలు ఏ నేరమూ చేయని వాడివి! మరి ఎందుకు హత్యచేశానని ఒప్పుకున్నావు?" అడిగాడు యువరాజ్.

"మా చెల్లెలికు తీరని అపకారం చేశాను. గౌరి అంటే నాకెంతో మమకారం, అనురాగం వుంది. గౌరిని నాభార్య రాచి రంపాన పెట్టడం సహించలేకపోయానండి. చివరకు గౌరి తలకు రాసుకోను కొబ్బరినూనె సైతం అందనిచ్చేది కాదు, నా భార్య! గౌరిని ఎన్నెన్నో బాధలకు గురిచేసింది హీనాతిహీనంగా. గౌరి అనుభవించు అవస్థల్ని చూస్తూ ఉండలేకపోయాను. సుగంధని మందలించాను! తిట్టాను!

కొట్టాను.

"గౌరి ఇంకా కష్టపడడం ఎక్కువైంది, సుగంధిచేత. గౌరిచేత చేయరాని పనులు చేయిస్తూ అధికారం చలాయిస్తూంటే చూస్తూ భరించలేకపోయాను.

"చివరకు ఫాల్గుణమూర్తి నా చెల్లెలును వివాహం చేసుకుంటానంటే సంతోషపడ్డాను. చెల్లెలుకు ఎంతో ఆడంబరం లేకపోయినా—నిండు మనసుతో దీవించి, అక్షింతలు వేస్తూ వివాహం చేయాలన్న నా ఆశనుకూడా మంటకలిపేసిందండి సుగంధి!!!"

ఏడుస్తున్నాడు తరుణేశ్వర్. అతని శరీరం చెమటతో తడిసి ముద్దయిపోయింది.

"గౌరిని హింసించిన సుగంధిని హింసించాలనుకున్నాను. అందుకే నిందమోపాను. అక్రమసంబంధం అంటగట్టాను—విచక్షణారహితంగా! మా చెల్లెలికి ఆడపడుచన్న అభిమానం కించెత్తైనా చూపలేని, చూపించలేని అసమర్థున్నైపోయాను. మా చెల్లెలికి నేను ఘోర అపరాధం చేసినవాడ్ని. ఇక్కట్లు అనుభవిస్తూందని తెల్సి వారించలేని వాజమ్మనైపోయాను. నేను నేరస్థుణ్ణి! శిక్ష అనుభవించాలి. నేను ఉరికంబానికి ఎక్కాలనే ఆ నేరం నామీద వేసుకున్నాను" దీనంగా ఏడ్వసాగాడు తరుణేశ్వర్.

అందరూ స్థంభించిపోయి నిలబడిపోయారు.

గౌరి అన్నయ్యను వాటేసుకుని ఏడుస్తోంది.

"నన్ను క్షమించండి" అంటూ సుగంధి వెళ్ళి తరుణేశ్వర్ కాళ్ళపై బడిపోయింది.

—: ఐపోయింది :—